
www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్


Published From : Hyderabad - Vijaywada - Delhi - Bengaluru
బుధవారం 16, జూలై, 2025 | పేజీలు :12



జగన్‌విజయమ్మ మధ్య ఆస్తుల వివాదం.. NCLT తీర్పు రిజర్వ్..! 2



3 బీసీలకు అసలే ద్రోహి కాంగ్రెస్సే.. ఇందిరా పార్క్ దగ్గర బీఆర్ఎస్ నేతల ధర్నా..!



4 హైదరాబాద్‌లో అస్థిపంజరం మిస్టరీ.. పాత ఫోన్‌తో వెలుగు లోకి అసలు నిజం..!



## జీనోమ్ వ్యాలీ నుంచి దేశవ్యాప్తంగా
# 33%వ్యాక్సిన్ ఉత్పత్తి: సీఎం రేవంత్

**టీపీఎన్, మేడ్చల్ మల్కాజ్‌గిరి:**

జీనోమ్ వ్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో తయారయ్యే వ్యాక్సిన్‌లలో 33 శాతం వరకు కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి అవుతుండడం రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. కోవిడ్ సమయంలో ఇదే ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్ సరఫరాకు కేంద్రబిందువైందని గుర్తు చేశారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని వెల్లడించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఈ ఏడాది డిసెంబర్ 9న ఆవిష్కరించనున్నట్టు ప్రకటించారు. భారత ప్రభుత్వం 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని ముందుంచిన నేపథ్యంలో, తెలంగాణ నుంచి కూడా సముచితమైన భాగస్వామ్యం అందించేందుకు ప్రభుత్వం నిబద్ధతగా ఉందని తెలిపారు. పాలసీలు, అనుమతులు, మౌలిక సదుపాయాల రంగాల్లో మారుతున్న అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం వివరించారు. ప్రభుత్వాలు మారినా పరిశ్రమలకు ఇబ్బందులు కలిగే విధంగా ఎలాంటి విధానాలను తీసుకురాలేదని, మునుపటి పాలసీల్లోని మంచి అంశాలను కొనసాగిస్తూ మరింత మెరుగైన పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాతి 18 నెలల కాలంలో రూ. 3 లక్షల 28 వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించగలిగామన్నారు.



# బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు 10% కేటాయింపు దుర్మార్గం: బండి సంజయ్..!

- **సిరిసిల్లలో 20,000 సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో బండి సంజయ్ వ్యాఖ్యలు**
- **బీసీ జాబితా నుంచి ముస్లింలను తక్షణమే తొలగించాలని డిమాండ్**
- **బీసీలకు 42% రిజర్వేషన్లలో కేవలం 32% మాత్రమే ఇవ్వడం అన్యాయం**
- **మతం ఆధారంగా రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం – బండి సంజయ్**
- **బీసీ సంఘాలు రాజకీయ ప్రేరణతో ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నాయి**
- **బీసీలకు న్యాయం జరగాలని బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం**

**టీపీఎన్, శ్రీకాంత్ గుర్రం:**

బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు ఇచ్చి బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ జాబితా నుంచి ముస్లింలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించడానికి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని.... అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడమంటూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. 51 శాతమున్న బీసీలకు కేవలం 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తూ, 12 శాతమున్న ముస్లింలకు మాత్రం వందకు వంద శాతం లాభాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బండి సంజయ్ ఆరోపించారు. బీసీలకు అదనంగా ఇచ్చేది కేవలం 5 శాతం మాత్రమేనని, ఇది పెద్ద తేడా కాదని విమర్శించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేమన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో టెన్త్ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో 20 వేలకుపైగా సైకిళ్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు కప్పిపుచ్చే ప్రయత్నంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను పక్కన పెట్టి ముస్లింలకు అనుకూలంగా పని చేస్తోందని, కొన్ని బీసీ సంఘాలు కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అన్యాయాన్ని సమర్థిస్తున్నాయని ఆరోపించారు. బీసీ సంఘాల నాయకులు బీసీల పక్షాన నిలవాలని, రాజకీయాలకతీతంగా గళం విప్పాలని సూచించారు. బీసీ జనాభా 51 శాతమని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పేరుతో దానిని 46 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. ఇది కూడా ఓ కుట్రలో భాగమేనన్నారు. ముస్లింలను బీసీ జాబితా నుంచి తొలగించి 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాంటప్పుడు కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం తీసుకురావాల్సిన బాధ్యతను తామే భరిస్తామని ప్రకటించారు. లేనిపక్షంలో ఊరుకోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ఫ్యూచర్ సిటీ రాష్ట్రానికి గేమ్‌చేంజర్‌గా నిలవనుంది: భట్టి



ఫోర్త్ సిటీగా అభివృద్ధి చెందుతున్న ఫ్యూచర్ సిటీ రాష్ట్రానికి గేమ్‌చేంజర్‌గా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మూసీ నది పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్ పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఊహకు కూడా అందదని తెలిపారు. హైదరాబాద్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (FTCCI) నూతన కార్యాలయాన్ని మంగళవారం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్ (ORR) మరియు రీజనల్ రింగ్ రోడ్ (RRR) మధ్యలో ఐటీ, ఫార్మా, హౌసింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పారిశ్రామికవేత్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా స్పందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సహా క్యాబినెట్ సభ్యులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న పవర్ బిల్లులను ఒకే సారి సెటిల్ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు అనువైన ప్రదేశమని, ఇక్కడి వాతావరణం, నైపుణ్య ఉద్యోగులు, అంతర్జాతీయ విమానాశ్రయం, రహదారి వ్యవస్థలు మెరుగ్గా ఉన్నాయని వివరించారు. సంపద సృష్టి లక్ష్యం కాదని, అది సమ సమాజ నిర్మాణానికి సాధనమని పేర్కొన్నారు. పరిశ్రమలు, పౌరసమాజం, ప్రభుత్వం కలిసి పనిచేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ సంపద పంచవచ్చని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విదేశాల్లో పర్యటించి భారీ పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని తెలిపారు. పరిశ్రమలకు రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని, త్వరలో గ్రీన్ పవర్ కూడా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. హైదరాబాద్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని, ఇక్కడి టెక్నాలజీ, ప్రతిభతో కొత్త సంపద ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన యువతను సిద్ధం చేయడానికి స్కిల్ యూనివర్సిటీలు, గ్రామాల వరకు డిజిటల్ సాక్షరత కోసం అంబేద్కర్ నాలెడ్జి సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. FTCCI పరిశ్రమలకు మార్గదర్శిగా నిలుస్తోందని, ఇది వంద సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగి ఉన్న సంస్థగా పేర్కొన్నారు. హైదరాబాద్ వర్తక కేంద్రంగా ఉండే రోజుల నుండి అంతర్జాతీయ నగరంగా ఎదిగే దశలో చాంబర్ పాత్ర ప్రముఖమైందన్నారు.



# చిరంజీవి నివాస పునరుద్ధరణపై హైకోర్టు కీలక ఆదేశాలు..!

- **మెగాస్టార్ చిరంజీవి నివాస పునరుద్ధరణపై హైకోర్టు కీలక ఆదేశాలు**
- **జూబ్లీహిల్స్ ఇంటి రిటైన్ వాల్ క్రమబద్ధీకరణకు 2025లో GHMCకి దరఖాస్తు**
- **అధికారుల నిర్లక్ష్యంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన చిరంజీవి**
- **2002లోనే అనుమతులు తీసుకున్నామని న్యాయవాది వాదన**
- **చట్టబద్ధ ప్రక్రియను చేపట్టాలని జీహెచ్‌ఎంసీకి హైకోర్టు ఆదేశం**
- **# త్వరలో నిర్ణయం తీసుకుంటామని విన్నవించిన GHMC న్యాయవాది**

**టీపీఎన్, హైదరాబాద్:**

టాలీవుడ్ యాక్టర్ మెగాస్టార్ చిరంజీవి నివాస పునరుద్ధరణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జూబ్లీహిల్స్‌లోని తన ఇంటిలో ఇటీవల చేపట్టిన మరమ్మతుల సందర్భంగా నిర్మించిన రిటైన్ వాల్‌ను క్రమబద్ధీకరించాలంటూ చిరంజీవి జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం.... చిరంజీవి దాఖలు చేసిన దరఖాస్తుపై చట్టబద్ధంగా నిర్ణయం తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించింది. చిరంజీవి తరఫు న్యాయవాది వాదనలో భాగంగా.... 2002లోనే ఇంటి నిర్మాణానికి అనుమతులు పొందినట్లు.. ప్రస్తుతం జరుగుతున్న పనులు చట్టబద్ధమైన పరిధిలోనే ఉన్నట్లు హైకోర్టుకు తెలిపారు. జీహెచ్‌ఎంసీ తరఫు న్యాయవాది తమవైపు ప్రక్రియ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని విన్నవించారు. కోర్టు జీహెచ్‌ఎంసీ నిర్ణయం తీసుకొని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించింది. ఈ తీర్పుతో చిరంజీవి నివాస పునరుద్ధరణ క్రమబద్ధీకరణకు మార్గం సుగమమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో సీపీఐ నేత హత్య: భూ వివాదమే కారణమా?

- **హైదరాబాద్‌లో కాల్పుల కలకలం**
- **సీపీఐ నాయకుడు చందు రాథోడ్ హత్య**
- **వెంటాడి, వేటాడి గన్ షాట్**
- **మలక్‌పేట శాలివాహన నగర్ పార్కు వద్ద ఘటన**
- **భూ వివాదం, ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం**

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**







హైదరాబాద్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శాలివాహన నగర్ పార్కు వద్ద జరిగిన ఈ ఘటనలో సీపీఐ నాయకుడు చందు నాయక్ రాథోడ్ హత్యకు గురయ్యాడు. వాకింగ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని నలుగురు దుండగులు కారులో వచ్చి అతనిపై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన వాకింగ్‌కు వచ్చిన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. చందు రాథోడ్ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందినవారు. గత 30 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ప్రస్తుతం చైతన్యపురిలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. స్వగ్రామమైన నర్సాయిపల్లిలో తల్లిదండ్రులు ఉంటున్నారు. మృతుడి కుటుంబసభ్యులు ఇది పథకం ప్రకారంగా జరిగిన హత్యేనని తెలిపారు. కాల్పులకు పాల్పడింది కూడా సీపీఐ నాయకుడేనని, అతడిని రాజేష్‌గా పోలీసులు గుర్తించారు.పోలీసుల విచారణలో చందు రాథోడ్, రాజేష్ మధ్య భూ వివాదం ఉందని, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఈ హత్య జరిగింది అనే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందితుడు రాజేష్‌తో పాటు శివ మరో ఇద్దరు కలసి ఈ దాడికి పాల్పడ్డారు. ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే నలుగురు నిందితులు ఎస్వోటీ పోలీసుల ఎదుట లొంగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## జగన్ విజయమ్మ మధ్య ఆస్తుల వివాదం:
# NCLT తీర్పు రిజర్వ్

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్:**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో ఆస్తుల వివాదం తాజాగా మరో మలుపు తిరిగింది. వైఎస్ విజయమ్మ, కుమారుడు వైఎస్ జగన్ మధ్య సాగుతున్న సరస్వతీ పవర్ వాటాల బదలాయింపు వివాదం ప్రస్తుతం హైదరాబాద్ లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (NCLT) దృష్టికి చేరింది. గుంటూరు జిల్లాలోని సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో భాగస్వామ్యాన్ని గతంలో జగన్‌భారతీ దంపతులు.... తల్లి విజయమ్మకు బదిలీ చేశారు. అప్పట్లో వైఎస్ షర్మిలతో కుటుంబ సంబంధాలు అనుకూలంగా ఉండటం, వారి సమ్మతితో వాటాల బదలాయింపు జరిగిందని వాదిస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో షర్మిలతో విభేదాలు తలెత్తిన నేపథ్యంలో.. తమ వాటాలు అక్రమంగా బదిలీ చేయబడ్డాయంటూ జగన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. సీబీఐ, ఈడీ కేసులతో సంబంధం ఉన్న వాటాలను కోర్టు తీర్పుల ముందే బదిలీ చేయడాన్ని జగన్ పక్షం అన్యాయమని అభిప్రాయపడింది. అయితే విజయమ్మ తరపు న్యాయవాదులు మాత్రం‘‘ఒకసారి గిఫ్ట్ రూపంలో వాటాలు బదిలీ చేసిన తరువాత వాటిని కోరే హక్కు లేదు. తిరిగి ఇవ్వాలంటే ఇరువైపులా అంగీకారం అవసరం’’ అని వాదించారు. ఇరు వర్గాల వాదనలు విన్న ట్రైబ్యునల్ తీర్పును రిజర్వ్ చేసింది. కానీ తీర్పు ప్రకటించే తేదీని ఇప్పటివరకు ప్రకటించలేదు. ట్రైబ్యునల్ తీర్పు ఇరు వర్గాలకూ కీలకంగా మారనుంది. ఎందుకంటే ఇప్పటికే విజయమ్మ షర్మిలకు మద్దతుగా నిలిచిన తరుణంలో.... ఆమెకు వ్యతిరేకంగా తీర్పు వస్తే షర్మిల పక్షాన తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక తీర్పు జగన్‌కు అనుకూలంగా వచ్చినా.... కుటుంబ సంబంధాల మధ్య బంధం మరింత దూరం అయ్యే అవకాశముంది





# ఏసీబీ అదుపులో మాజీ ఈఎన్‌సీ మురళీధర్ రావు..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (ఈఎన్‌సీ) మురళీధర్ రావును ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆయన నివాసంతో పాటు, కరీంనగర్, జహీరాబాద్‌ల లోని బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నాయి. మురళీధర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో పదవీ విరమణ చేసినప్పటికీ, ఆయన పదవీ కాలాన్ని 13 ఏళ్లు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతకాలం కొనసాగిన ఆయనను, మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తర్వాత ప్రభుత్వం తొలగించింది.

**కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు**

తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో, ఏసీబీ ప్రత్యేక దృష్టి సారించి, ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించిన అధికారుల అవినీతిపై లోతైన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇప్పటికే మాజీ ఈఎన్‌సీ హరి రామ్, ఈఈ నూనె శ్రీధర్‌లను అరెస్టు చేసిన ఏసీబీ, తాజాగా మురళీధర్ రావును కూడా అదుపులోకి తీసుకుంది.

**విస్తృత సోదాలు**

మురళీధర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంతో పాటు, హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్‌లో మొత్తం 10 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లు కూడా ఉన్నాయని ఏసీబీ వర్గాలు తెలిపాయి. సబ్‌కాంట్రాక్టుల కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఏసీబీ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ సోదాల్లో భారీగా అక్రమ ఆస్తులను గుర్తించినట్లు సమాచారం.

**గత అరెస్టులు మరియు కమిషన్ విచారణ**

గతంలో అరెస్టు చేసిన హరి రామ్, నూనె శ్రీధర్‌ల ఇళ్లలో జరిపిన సోదాల్లో వందల కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ గుర్తించింది. ఈ అక్రమాలు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సబ్‌కాంట్రాక్టులు, నిధుల కేటాయింపుల్లో జరిగిన అవకతవకల నుంచి వచ్చాయని అనుమానిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ చేపట్టింది. ఈ విచారణలో మురళీధర్ రావును కూడా ప్రశ్నించగా, ఆయన "నాకు తెలియదు, మర్చిపోయాను" వంటి సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. విజిలెన్స్ నివేదికలో మురళీధర్ రావు పేరు ఉండటంతో ఏసీబీ ఆయనపై దృష్టి సారించింది.

**భవిష్యత్ చర్యలు**

మురళీధర్ రావు నివాసంలో సాయంత్రం వరకు సోదాలు కొనసాగే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. సోదాలు పూర్తయిన తర్వాత ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై ఏసీబీ దర్యాప్తు మరింత తీవ్రతరం కానుందని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.



# కంటోన్మెంట్ కార్యాలయంలో సాధారణ బోర్డు సమావేశం..!

**టీపీఎన్, సికింద్రాబాద్ :**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ కార్యాలయంలో సాధారణ బోర్డు సమావేశం జరిగింది. కంటోన్మెంట్ బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశానికి మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్, సీఈవో మధుకర్ నాయక్ నామినేటర్ సభ్యురాలు భానుక నర్మదా పాల్గొన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల మూలంగా కోల్పోయిన భూములకు పరిహారంగా 303 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిన నేపథ్యంలో కంటోన్మెంట్ అభివృద్ధికి కేటాయించే పలు అంశాలపై బోర్డు సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతంలో వర్షాకాల నేపథ్యంలో ముంపునకు గురవుతున్న ప్రాంతాలు, కాలనీల సమస్యలను తీర్చేందుకు 303 కోట్ల బడ్జెట్ లో ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయింపులు చేయాలని అన్నారు. నాలాల విస్తరణతో పాటు సివరేజ్, భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరినట్టు తెలిపారు. రామన్న కుంట చెరువుతోపాటు కంటోన్మెంట్లోని ఇతర చెరువులలో సుందరీకరణ పనులు చేపట్టి వాకింగ్ ట్రాక్ తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడే విధంగా అభివృద్ధి చేయాలని అన్నారు. ప్రభుత్వం వద్ద కొనుగోలు చేసిన భూముల విషయంలో కంటోన్మెంట్ బోర్డు అనుమతులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# అందోల్ నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగాల్లో హబ్‌గా అభివృద్ధి చేస్తాం: మంత్రి

**టీపీఎన్, తెలంగాణ:**



అందోల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రత్యేక ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా తెలిపారు. మంగళవారం ఆయన ఆందోల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, విద్యా సంస్థలు, వైద్య రంగంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఆందోల్ మండల కేంద్రంలో ఉన్న KGBV పాఠశాలను సందర్శించిన మంత్రి... విద్యార్థులకు అందుబాటులో ఉన్న డిజిటల్ క్లాస్‌రూములు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ బ్లాక్ వంటి వసతులను పరిశీలించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ముచ్చటించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. “ఇప్పటి ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకంటే మెరుగైన మౌలిక వసతులు కలిగి ఉన్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం,” అని మంత్రి అన్నారు.

ప్రతి పాఠశాలలో డిజిటల్ లెర్నింగ్, సైంటిఫిక్ ల్యాబ్‌లు, కంప్యూటర్ విద్య వంటి ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం, ఆందోల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కాలేజీ పనులను పరిశీలించిన మంత్రి... త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలంటూ అధికారులకు సూచనలు ఇచ్చారు. నర్సింగ్ విద్యార్థులకు అత్యాధునిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక మహిళల విద్యాభివృద్ధికి ఆందోల్ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ కీలకంగా మారుతుందని పేర్కొంటూ, అక్కడి ల్యాబ్స్, తరగతి గదులు, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించి అధికారులకు సూచించారు. పర్యటనలో భాగంగా, నాందేడ్ జాతీయ రహదారి నుండి జోగిపేట వరకు నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారి పనులను మంత్రి పరిశీలించారు. “ఈ రహదారి, ఫ్లైఓవర్‌తో కలిసి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలను అందిస్తుంది. రోడ్డు విస్తరణ ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు వేగం వస్తుంది,” అని తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్‌ను కలిసిన
# మంత్రి శ్రీధర్ బాబు

**టీపీఎన్, తెలంగాణ:**

డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంగళవారం బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ ది స్టేట్ మార్క్ లామీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వాణిజ్యం, పెట్టుబడులు, పరిశ్రమలు, ఐటీ తదితర రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై ఇరువురు చర్చించారు. సహకారాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# కాలం చెల్లిన వస్తువులతో బేకరీ ఐటమ్స్ తయారీ..!

- **మేడ్చల్ ఎస్ఓటి పోలీసుల తనిఖీలో నమ్మలేని నిజాలు**
- **ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ లోపం,ప్రజలకు ఇది శాపం**

**టీపీఎన్, మేడ్చల్ జిల్లా :**

సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరారంలోని ఓం ఝుండా సమీపంలో ఉన్న డ్రీమ్ పఫ్ బేకరీపై మేడ్చల్ ఎస్ఓటి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నమ్మలేని నిజాలు బయటకు వచ్చాయి. వారు ఉపయోగించే కేక్స్, బ్రేడ్స్ లలో కాలం చెల్లిన వాటిని ఉపయోగిస్తున్నారు. ఎస్ఓటి పోలీసులు వారి దగ్గర నుండి వివిధ కాలం చెల్లిన వస్తువులు వెనీలా పౌడర్ 04 యూనిట్లు, మిల్క్ ఫ్లేవర్ 02 యూనిట్లు, ఫ్లేవరింగ్ ఏజెంట్ 01 బాటిల్, సింథటిక్ కలర్,కేకులు 39.5 కిలోల.బన్స్ స్వాధీనం చేసుకున్నారు. తయారీ ప్రక్రియ మరియు ప్రాంగణం అపరిశుభ్రంగా మరియు ఆహార ఉత్పత్తికి సురక్షితం కాదు అని వారన్నారు.అదేవిధంగా కాలం చెల్లిన పదార్థాలను కేక్స్, బ్రెడ్స్ ఇతర బేకరీ ఐటమ్స్ లలో వాడుతున్నారని,ఫుడ్ లైసెన్స్ లేకపోవడం కార్మిక లైసెన్స్ లేకపోవడం పూర్తిగా బేకరీ చట్టవిరుద్ధంగా ఆహార ఉత్పత్తులను తయారు చేస్తోంది అని మేడ్చల్ ఎస్ఓటి సీఐ తెలిపారు. బేకరీలు నయా దందా మొదలుపెట్టారు. కాలం చెల్లిన వస్తువులతో బేకరీ ఐటమ్స్ తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.బేకరీ పైన ఎస్ఓటి పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ తనిఖీలలో మేడ్చల్ ఎస్ఓటి టీం పాల్గొన్నారు.

**ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరుపై స్థానికులు మండిపాటు**

ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నట్టా? లేనట్టా ? కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ అనేది ఎక్కడా కూడా లేదు. మేడ్చల్ ఎస్ఓటి పోలీసులు దాడి చేసిందే ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. స్థానిక జిహెచ్ఎంసి అధికారులు ఎక్కడ తనిఖీలు చేసిన దాఖలాలు కనబడడం లేదు. బేకరీ లు, హోటల్స్, ఫుడ్ ఐటమ్స్ తయారయ్యే కేంద్రాలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మరియు కుత్బుల్లాపూర్ జిహెచ్ఎంసి అధికారులు ఎక్కడ కూడా తనిఖీలు చేయడం లేదని స్థానికులు అధికారుల మీద మండిపడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వదలాలని స్థానికులు కోరుతున్నారు. తరచూ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తే ఇలాంటి తప్పిదాలు ఏవి జరగవని స్థానికులు కోరుతున్నారు.

# బీసీలకు అసలు ద్రోహి కాంగ్రెస్సే.. ఇందిరా పార్క్ దగ్గర బీఆర్ఎస్ నేతల ధర్నా..!

- నయవంచనకు మారు పేరు సీఎం రేవంత్‌రెడ్డి
- 42 శాతం కోటాకు చట్టబద్ధత కల్పించాల్సిందే
- లేదంటే బీసీలందరూ మరణశాసనం రాయడం ఖాయం
- అబద్ధాలతో మభ్యపెడితే తిరగబాటు తప్పదు
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



**టీపీఎన్, హైదరాబాద్ :**

స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఇప్పటి వరకు బీసీలకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నయవంచన, నమ్మక ద్రోహం. మోసం, కుట్రలకు మారుపేరని నిప్పులు చెరిగారు. మంగళవారం బీసీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. బీసీలు భారతదేశంలో రెండో శ్రేణి పౌరులుగా జీవిస్తున్నారంటే ఇందుకు హస్తంపార్టీయే కారణమని దుయ్యబట్టారు. అరవైఏళ్లు అధికారం వెలగబెట్టిన ఆ పార్టీ కులగణన చేయకుండా, బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా, సంపద సృష్టిలో భాగస్వామ్యం చేయకుండా దగా చేసిందని మండిపడ్డారు. అందుకే ఆ పార్టీ దేశవ్యాప్తం గా పుట్టగతులు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలోనూ కులగణన చేస్తామని, బడ్జెట్‌లో ఏటా రూ. 20 కోట్లు కేటాయిస్తామని, అనేక న్యాయపరమైన చిక్కులు ఎదురైతాయని తెలిసినా ఓట్ల కోసం అలవికానీ హామీలిచ్చి అధికారంలో వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏనాడు బీసీ కోటాకు చట్టబద్ధత కల్పించే విషయంలో చిత్తశుద్ధిని చూపలేదని ఆక్షేపించారు. ఇప్పుడు బీసీ వర్గాల నుంచి ఒత్తిడి పెరిగినా తర్వాత హడావుడి చేస్తూ తప్పటడుగులు వేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నదని తెలిసినా కేసీఆర్ సూచనల మేరకు బీఆర్ఎస్ మద్దతిస్తూ వచ్చామన్నారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా విలువైన సూచనలు చేశామని గుర్తుచేశారు. కానీ ప్రభుత్వం మాత్రం తమ నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నదని విమర్శిం చారు. బీసీ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, రాష్ట్రపతికి పంపించి చేతులు దులుపుకు న్నదని ఆరోపించారు. అనేకసార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఢిల్లీకి వెళ్లి ఏనా డు బీసీ బిల్లుల గురించి రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కలువలేదని ఆక్షేపించారు. అఖిలప క్షాన్ని తీసుకెళ్లడంలోనూ విఫలమైందని ఆరోపించారు. ఏది ఏమైనా బీసీలకు 42 శాతం కోటాకు చట్టబద్ధత కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ సర్కారు వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. బీసీబిడ్డలు తిరగబడి మరణశాసనం లిఖించడం ఖాయమని తేల్చిచెప్పారు.

**చట్టబద్ధత కల్పించకుండా దగా: వద్దిరాజు**

కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు తప్పుడు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు నిండా ముంచుతున్నదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. బీసీ రిజర్వే షన్లకు చట్టబద్ధత కల్పించకుండా బలహీనవర్గాలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి బీసీ బిల్లులు పంపించేందే తప్పా ఆమోదానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడంలేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమై ఇప్పు డు ఆర్డినెన్స్‌ల పేరిట డ్రామాలు ఆడుతున్నదని దుయ్యబట్టారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే లోకల్‌బాడీ ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే ఓటుతో బుద్ధి చెప్పేందుకు బీసీ బిడ్డలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

**బీసీలను మోసం చేస్తే భూకంపం సృష్టిస్తాం: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్**

కామారెడ్డి డిక్లరేషన్‌లో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో ఇప్పించిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాల్సిందేనని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తేల్చి చెప్పారు. బీసీలను మోసం చేయాలని చూస్తే భూకంపం సృష్టిస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. తప్పుల తడకగా కులగణన చేసిందని విరుచుకుపడ్డారు. నగరంలో 20 లక్షల మందికి ఇండ్లకు వెళ్లకుండానే తప్పుడు గణంకాలతో బీసీల జనాభాను తగ్గించి చూపిందని దుయ్యబట్టారు. మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి ఇప్పుడు దగా చేస్తున్నదని విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా బీసీ బిల్లులను ఆమోదించి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలు యాచకులు కాదని, నమ్మించి వంచిస్తే తమ సత్తా ఏంటో చూపుతామని హెచ్చరించారు.

**కాంగ్రెస్‌దే మోసాల చరిత్ర: మాజీ మంత్రి గంగుల కమలాకర్**

నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ది మోసాల చరిత్రేనని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీల ఓట్ల కోసం అర్రులు చాచి ఇప్పుడు మొండి చెయ్యి చూపుతున్నదని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదానికి పార్లమెంట్ ప్రతిపక్షనేత రాల్‌గాంధీ చొరవ చూపాలని కోరారు. నమ్మించి నట్టేటా ముంచాలని చూస్తే ఊరుకొనే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమించి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు.

**ఇవ్వకుంటే గుంజుకుంటాం: మాజీ మంత్రి శ్రీనివాస్గౌడ్**

కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల అమలులో ఉద్దేశ్య పూర్వకంగానే కాలయాపన చేస్తున్నదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్గౌడ్ ఆరోపించారు. బలహీనవర్గాలంటే ఆ పార్టీకి మొదటి నుంచి చిన్నచూపేనని విమర్శించారు. అందుకే 42 శాతం కోటా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నదని దుయ్యబట్టారు. బీసీలంటే అడుక్కునే వారు కాదనే విషయాన్ని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఆచరణలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకుంటే పోరాడి గుంజుకుంటామని హెచ్చరించారు.

సంఘటితంగా ఉద్యమిస్తాం: మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. మొదటి నుంచి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని దుయ్యబట్టారు. ఇప్పుడు కూడా బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా ధోకా చేయాలని చూస్తున్నదని విమర్శించారు. అయితే కోటా ఇవ్వకుంటే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకొనే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. బీసీలందరూ ఏకమై ఉద్యమించి సాధించకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో బలహీనవర్గాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

**అన్యాయం చేస్తే తరిమికొడతాం: ఎమ్మెల్యే ముఠా గోపాల్**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బలహీనవర్గాలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకొనే ప్రసక్తిలేదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హెచ్చరించారు. నాడు రేవంత్‌రెడ్డి బీసీల ఓట్లను కొల్లగొట్టేందుకు పచ్చి అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు. ఇప్పుడు అమలు చేయకుండా డైవర్షన్ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు.

**వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలి: మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్**

నాడు కేసీఆర్ సూచనల మేరకు పార్లమెంట్‌లో బీసీలు, ఎస్సీఎస్టీలు, మైనార్టీ గురించి కొట్లాడినం. కులగణన చేయాలని సభ లోపల బయటా పోరాటం చేశామని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ గుర్తు చేశారు. బీసీ ప్రధాన మంత్రి అయినా కేంద్రంలో ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయలేకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలనే కాదు రైతులను, కార్మికులను, ఉద్యోగులను మోసం చేస్తున్నదని ఆరోపించారు. బీసీలందరూ ఐక్యంగా వచ్చే లోకల్‌బాడీ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

**రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతాం: తుల ఉమ**

బలహీనవర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా అన్యాయం చేయాలని చూస్తున్న ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని బీఆర్ఎస్ మహిళా నేత, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తేల్చిచెప్పారు. రేవంత్‌రెడ్డికి బీసీల ఓట్లపై ఉన్న ప్రేమ సంక్షేమ పథకాల అమలుపై లేదన్నారు. కేసీఆర్ పాలనలో బీసీలను సముచితంగా గౌరవిస్తే కాంగ్రెస్ మాత్రం అడుగడుగునా అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా బీసీలకు 42 శాతం కోటా ఇవ్వాల్సిందేనని ఉద్ఘాటించారు. లేదంటే సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

**రేవంత్‌రెడ్డి..కోటా ఇచ్చే దమ్ములేకుంటే దిగిపో : వకులాభరణం**

అమరుల త్యాగ ఫలంగా ఏర్పడ్డ తెలంగాణలో బీసీలందరూ ఏకమై దండులా కదిలి కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం కొట్లాడాలని పిలుపునిచ్చారు. అగ్రవర్ణ ప్రభుత్వం అధికారంలో ఉంటే బలహీనవర్గాలకు ఏం జరుగుతదో సీఎం రేవంత్‌రెడ్డి తన పాలనలో చూపుతున్నారని చెప్పారు. ఇదిగో రిజర్వేషన్లు అంటూ మభ్యపెడుతూ తమది రోల్ మోడల్ ప్రభుత్వమని చెప్పుకుంటున్నారని, కానీ ఆచరణలో మాత్రం విఫలమయ్యారని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం కోటాపై తప్పటడుగులు వేస్తూ బీసీలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. బీసీల హక్కులను కాలరాసి ధోకా చేసేందుకు యత్ని స్తున్నారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి బీసీలకు రిజర్వేషన్లు ఉద్దేశం లేదన్నారు. తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రాల్‌గాంధీ బీసీ రిజర్వేషన్ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు మోడీని ఎందుకు ఒప్పించడంలేదు? పార్లమెంట్‌లో ఎందుకు కొట్లాడడం లేదు? అని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం కోటా ఇచ్చే దమ్ములేకుంటే రేవంత్‌రెడ్డి పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు. విషకౌగిలి తో మాయ మాటలతో మోసం చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కోటా వచ్చేదాకా పోరాటాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

**యుద్ధానికి నాంది పలుకుదాం: జస్టిస్ ఈశ్వరయ్య**

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అంటే ఒక్క రెడ్లకే కాదు..బీసీలకు, బీసీలకు రాష్ట్ర ప్రజలందరికీ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని జస్టిస్ ఈశ్వరయ్య హితవు పలికారు. ఆయన బీసీలకు అందించిన కాగడాను పట్టుకొని హక్కులను సాధించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా యుద్ధానికి నాంది పలుకుదామని పిలుపునిచ్చారు. చట్టపరమైన చిక్కులు ఎదురవుతాయని తెలిసినా కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని ఆరోపించారు. ఏదో నామమాత్రంగా అసెంబ్లీలో తీర్మానం పెట్టి కులగణనకు ఉపక్రమించారన్నారు. మేధావులందరం కలిసి ఓ సమగ్ర ఫార్మాట్‌ను రూపొందించి ప్రభుత్వానికి అందిస్తే కాగితాలకే పరిమితం చేసిందని ఆరోపించారు. ఇండ్లళ్లకు వెళ్లకుండానే లెక్కలు తయారు చేశారని ధ్వజమెత్తారు. 20 నెలలైనా ప్రభుత్వం చట్టబద్ధత కల్పించకుండా నాన్చడం విడ్డూరమని విమర్శించారు. తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్‌లో పెడితే గానీ బీసీ రిజర్వేషన్ల కోటాకు చట్టబద్ధత రాదని అభిప్రాయపడ్డారు. కానీ తమిళనాడులో చేసిన విధంగా సమగ్రంగా చట్టాన్ని రూపొందించి ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. కానీ మేం రూపొందించిన చట్టాన్ని, సూచనలు విస్మరించి ముందుకు వెళ్లి కోటాను ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. బీసీలు సంఘటితమై బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

---

## ఎన్నికల గుర్తులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు
# బీఆర్ఎస్ నేతల వినతి

**టీపీఎన్, తెలంగాణ:**

బీఆర్ఎస్ నేతలు బోయినపల్లి వినోద్ కుమార్, సోమ భరత్ కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారిక ఎన్నికల గుర్తు "కారు"ను పోలిన గుర్తులను తొలగించాలని కోరారు. చపాతీ రోలర్, కెమెరా, షిప్ వంటి గుర్తులు ఇటీవల జరిగిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి నష్టం కలిగించాయని కంప్లైంట్ చేశారు. ఈ గుర్తులు ఫ్రీ సింబల్స్ జాబితాలో కొనసాగుతుండటం వల్ల ఓటర్లలో అయోమయం ఏర్పడి బీఆర్ఎస్ ఓట్లకు ప్రభావం చూపిందని వివరించారు. “కారు” గుర్తును పోలిన ఇలాంటి గుర్తులను ఫ్రీ సింబల్స్ జాబితా నుంచి తొలగించి, భవిష్యత్తులో వాటిని ఎవరికి అయినా కేటాయించకుండా స్టాంబ్ చేయాలని వారు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వారు ఒక లిఖితపూర్వక వినతిపత్రాన్ని సమర్పించారు. టీపీఎన్, తెలంగాణ: బీఆర్ఎస్ నేతలు బోయినపల్లి వినోద్ కుమార్, సోమ భరత్ కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. రా




ష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారిక ఎన్నికల గుర్తు "కారు" ను పోలిన గుర్తులను తొలగించాలని కోరారు. చపాతీ రోలర్, కెమెరా, షిప్ వంటి గుర్తులు ఇటీవల జరిగిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి నష్టం కలిగించాయని కంప్లైంట్ చేశారు. ఈ గుర్తులు ఫ్రీ సింబల్స్ జాబితాలో కొనసాగుతుండటం వల్ల ఓటర్లలో అయోమయం ఏర్పడి బీఆర్ఎస్ ఓట్లకు ప్రభావం చూపిందని వివరించారు. “కారు” గుర్తును పోలిన ఇలాంటి గుర్తులను ఫ్రీ సింబల్స్ జాబితా నుంచి తొలగించి, భవిష్యత్తులో వాటిని ఎవరికి అయినా కేటాయించకుండా స్టాంబ్ చేయాలని వారు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వారు ఒక లిఖితపూర్వక వినతిపత్రాన్ని సమర్పించారు.

---

## మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన
# ప్రొఫెసర్ వెంకట రమణ

**టీపీఎన్, తెలంగాణ:**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన ప్రొఫెసర్ వెంకట రమణ మంగళవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి తన నియామకానికి సంబంధించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రొఫెసర్ వెంకట రమణకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పర్యాటక రంగాభివృద్ధిలో నిథమ్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సంస్థను అత్యున్నత



ప్రమాణాలతో ముందుకు తీసుకెళ్లేలా కృషి చేయాలని మంత్రి సూచించారు.

---

# బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌కు ఏర్పాట్లు పూర్తి

**టీపీఎన్, హైదరాబాద్:**

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ఈ నెల 19వ తేదీన జరుగనుంది. శనివారం ఉదయం 10 గంటలకు మల్లాపూర్‌లోని వి.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో జరగనుంది. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పలు రంగాల ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వర్క్‌షాప్ ప్రారంభ సెషన్‌కి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ప్రఖ్యాత కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ యువతలో సృజనాత్మకతపై సందేశమిస్తారు. అనంతరం 3 గంటల నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడతారు. సాయంత్రం 4 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వర్క్‌షాప్‌కి హాజరై విద్యార్థి నాయకులకు మార్గదర్శనం చేయనున్నారు. వర్క్‌షాప్ ఏర్పాట్లను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిషోర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు, పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి సమీక్షించారు. వేదిక, భద్రత, భోజన సదుపాయాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.



---

# మెదక్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ సెక్రటరీ హత్య:
## కడప ఎమ్మెల్యేతో భూ వివాదాలే కారణమా?

- మెదక్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ సెక్రటరీ అనిల్ మృతి కేసులో పురోగతి
- కడపకు చెందిన ఓ ఎమ్మెల్యే కుటుంబంతో అనిల్‌కు భూ వివాదాలు
- అనిల్ హత్యకు రియల్ ఎస్టేట్ గొడవలే కారణమని పోలీసుల అనుమానం
- రెండు కార్లలో వచ్చి అనిల్‌ను అడ్డగించి తుపాకీతో కాల్చి చంపిన దుండగులు





**టీపీఎన్, మెదక్:**

నర్సాపూర్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ సెల్ సెక్రటరీ అనిల్ దారుణ హత్యకు గురైన ఘటన కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అనిల్‌ను హత్య చేసిన ఘటనపై విచారణ చేస్తున్న పోలీసులు, ఇది కేవలం వ్యక్తిగత వైరం కాదని, రియల్ ఎస్టేట్ వ్యవహారం కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అనిల్‌కు కడపకు చెందిన ఓ ఎమ్మెల్యే కుటుంబంతో గత కొంతకాలంగా భూ సంబంధిత వివాదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే అనిల్‌పై పగతీర్చుకునేందుకు దాడికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం ఉదయం రెండు కార్లలో వచ్చిన దుండగులు అనిల్ వెళ్తున్న మార్గంలో అతని వాహనాన్ని అడ్డగించి.. తుపాకీతో అతనిపై కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన అనిల్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం కార్లలో పరారయ్యారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుల కార్ల వివరాలు సేకరించారు. అనిల్ తొలుత రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్సై గౌస్ ప్రకటించారు. పెట్రోలు బంక్ నిర్వహిస్తున్న అనిల్.. సోమవారం రాత్రి మెదక్ నుంచి స్వగ్రామానికి కారులో బయల్దేరాడు. ఇదే మండలం చిన్నఘనపూర్ విద్యుత్తు ఉపకేంద్రం వద్ద కారు అదుపు తప్పి కల్వర్టుకు వాహనం ఢీకొట్టింది. దీంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. అనిల్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడున్న వారు గమనించి మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా బుల్లెట్ల విషయం వెలుగులోకి వచ్చింది.

# మల్నాడు డ్రగ్స్ మాఫియాలో.. పోలీస్ బాస్ కుమారులు..!

- మల్నాడు రెస్టారెంట్ కేంద్రంగా డ్రగ్స్ మాఫియా
- డ్రగ్స్‌ను నైజీరియన్ ద్వారా నగరానికి రప్పించి సప్లై
- సూర్యతో కలిసి రాహుల్ తేజ, మోహన్ డ్రగ్స్ దందా
- ఇద్దరు పోలీస్ బాస్ కుమారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఫోన్ డేటాలో భారీ నెట్‌వర్క్ ఆధారాలు
- 2024లో నిజామాబాద్ డ్రగ్స్ కేసులోనూ నిందితుడిగా రాహుల్ తేజ!




**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**

హైదరాబాద్‌ను కలచి వేస్తున్న మల్నాడు డ్రగ్స్ కేసులో రోజుకో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదట్లో చిన్నచిన్న అనుమానాలుగా కనిపించిన ఈ వ్యవహారం, విచారణలో భారీ మాఫియా సూత్రధారుల పేర్లు బయటకు వస్తున్నాయి. కిచెన్ యజమాని సూర్యతో మొదలైన ఈ డ్రగ్స్ కేసు.. ప్రస్తుతం పోలీస్ అధికారుల కుమారుల చేరికతో రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడేలా మారింది. ఈ కేసులో విచారణ చేపట్టిన ఈగల్ స్పెషల్ టీమ్ ఇప్పటికే పలు కీలక ఆధారాలు సేకరించింది. డ్రగ్స్ మాఫియాలో నైజీరియన్లు కూడా పాత్ర పోషిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇటీవల ఇంటెలిజెన్స్ ఏఎస్పీ వేణుగోపాల్ కుమారుడు రాహుల్ తేజను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా సైబరాబాద్ ఏఆర్ డీసీపీ సంజీవ్ కుమారుడు మోహన్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ తేజ, మోహన్, హర్ష అనే మరో వ్యక్తి కలిసి మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్యతో కలసి డ్రగ్స్ రాకపోకలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీరు నైజీరియన్ మాఫియా ద్వారా డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు రప్పించి, నగరంలోని ఖరీదైన హోటళ్ళు, క్లబ్బుల ద్వారా వాటిని సరఫరా చేసినట్టు ఆధారాలు లభించాయి. ఈ కేసులో ఇప్పటికే హర్ష, మోహన్‌లను రిమాండ్‌కు తరలించారు. వీరి మొబైల్ ఫోన్ డేటా ఆధారంగా మరికొంతమంది యువత, అధికారుల పిల్లల నేర సంబంధాలు వెలుగులోకి వస్తున్నాయి. అనుమానిత నంబర్ల ఆధారంగా పలువురిని ప్రశ్నించేందుకు రంగం సిద్ధం చేశారు. రాహుల్ తేజ 2024లో నిజామాబాద్ డ్రగ్స్ కేసులో ఏ3 నిందితుడిగా కూడా ఉన్నాడు. అయితే అప్పట్లో అతని తండ్రి ఒత్తిడితో మేరకు అక్కడి పోలీసులు అరెస్ట్ చేయడానికి వెనుకడుగు వేసినట్లు సమాచారం. తన తండ్రి బలం చూసుకుని నేర కార్యకలాపాలు కొనసాగిస్తూ డ్రగ్స్ మాఫియాలో చేరినట్లు తెలుస్తోంది. కేసులో పోలీసులు ఇప్పటికే పలువురిని కోర్టు కస్టడీకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఇంకెంతమంది అధికారుల కుమారులు ఈ నెట్‌వర్క్‌లో ఉన్నారో తెలియాల్సి ఉంది. పోలీస్ శాఖలో ఈ వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. ప్రభుత్వం కూడా ఈ కేసును సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకునే యోచనలో ఉన్నట్లు సమాచారం.

# హైదరాబాద్, చర్లపల్లి రైల్వే స్టేషన్లను తనిఖీ చేసిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ..!

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం హైదరాబాద్ దక్కన్ (నాంపల్లి), చర్లపల్లి రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) భరతేష్ కుమార్ జైన్, సీనియర్ అధికారులు కూడా ఉన్నారు.హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్, వెయిటింగ్ హాల్స్, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సర్క్యులేటింగ్ ఏరియా, ఇతర ప్రాంతాలను జీఎం సందర్శించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించి, బాధ్యుల నుంచి నివేదిక తీసుకున్నారు. పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకముందు చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడి ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ హాల్స్, స్లీపింగ్ పాడ్‌లు, కెఫెటేరియా, టికెట్ కౌంటర్లు, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, ఈవీ ఛార్జింగ్ పాయింట్లను పరిశీలించారు. అదేవిధంగా బుకింగ్ క్లర్క్, 'సఫాయ్ మిత్ర' సిబ్బందితో సంభాషించారు. వారి డ్యూటీ వేళలు, అందుతున్న సౌకర్యాలు గురించి అడిగితెలుసుకున్నారు.




# హైదరాబాద్‌లో అస్థిపంజరం మిస్టరీ: పాత ఫోన్ తో వెలుగులోకి అసలు నిజం..!

- అస్థిపంజరం గుట్టువిప్పిన మొబైల్ ఫోన్
- నాంపల్లిలోని ఓ ఇంట్లో బయటపడ్డ అస్థిపంజరం
- స్థానిక యువకుడు తీసిన వీడియోతో వెలుగులోకి

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**

హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలో ఓ పాడుబడిన ఇంట్లో గుర్తు తెలియని అస్థిపంజరం బయటపడింది. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. మృతుడు ఆ ఇంటి యజమాని మునీర్ ఖాన్ కుమారుడు అమీర్ ఖాన్‌గా పోలీసులు గుర్తించారు. ఎలాంటి గాయాలు, ఇంట్లో రక్తపు మరకలు లేకపోవడంతో ఇది సహజ మరణంగా కనిపిస్తోందని భావిస్తున్నారు. అమీర్ ఖాన్ పదేళ్ల క్రితమే మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా పోలీసులు అనుమానిస్తున్నారు.

ఒక స్థానిక యువకుడు తన మొబైల్‌లో తీసిన వీడియో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు రంగంలోకి దిగి ఇంటిని పరిశీలించగా, అక్కడ ఓ పాత నోకియా మొబైల్, మంచంపై దిండు కింద కొంత పాత కరెన్సీ లభించింది. ఆ ఫోన్‌ను మరమ్మతు చేసి పరిశీలించిన సమయంలో అందులో 84 మిస్స్డ్ కాల్స్ ఉన్నట్లు గుర్తించారు. అవన్నీ



2015లో వచ్చినవిగా అధికారులు తెలిపారు. ఇదే సమయంలో అమీర్ ఖాన్ మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు.అమీర్‌కు పదిమంది తోబుట్టువులున్నారని, వారిలో కొందరు విదేశాల్లో ఉండగా ఒకరు నగరంలోనే ఉన్నారని పోలీసులు తెలిపారు. అయినప్పటికీ ఎవరూ అమీర్ గురించి పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. అస్థిపంజరాన్ని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపినట్టు తెలిపారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# సున్నం చెరువులో హైడ్రా సర్వే.. ఎఫ్టీఎల్..బఫర్ జోన్ ల గుర్తింపు..

**టీపీఎన్, హైదరాబాద్ :**

మాదాపూర్ సున్నం చెరువు వద్దకు మరోసారి హైడ్రా అధికారులు చేరుకున్నారు. ఈ సారి కూల్చివేతలు పక్కన పెట్టి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను గుర్తించే పనిలో పడ్డారు. ఇటీవల హైడ్రా అధికారులు సున్నం చెరువు చుట్టుపక్కల వుండే సుమారు 70 చిరు వ్యాపారాల సముదాయాలను నేలమట్టం చేశారు. స్థానికంగా ఉద్రిక్తత చోటు చేసుకున్న అధికారులు ఆయా షాపులను కూల్చివేశారు. చెరువు ఎఫ్టిఎల్, బఫర్ జోన్‌లు గుర్తించకుండా ఎలా తమ వ్యాపారాలు కూల్చివేస్తారని స్థానికులు, పలువురు వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే సైతం హైడ్రా తీరును తప్పుబట్టారు. కొందరు వ్యాపారులు ఈ విషయంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ తేల్చకుండా అక్రమం అంటూ ఎలా నేలమట్టం చేస్తారని హైకోర్టు హైడ్రాపై మండిపడింది. కోర్ట్ మొట్టికాయలు వేసే సరికి అధికారులు ఉదయాన్నే సున్నం చెరువు వద్దకు చేరుకున్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలు, శాటిలైట్ మ్యాపింగ్,



రికార్డుల ఆధారంగా సున్నం చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లను గుర్తించి వాటికి మార్కింగ్ చేయడం జరిగింది. ఇదిలావుంటే కోర్ట్ సీరియస్ అయితే తప్ప హైడ్రాలో చలనం రాలేదని పలువురు స్థానికులు అభిప్రాయపడ్డారు. ఎక్కడపడితే అక్కడ ఎవరు పడితే వారు ఇచ్చే నివేదికల ఆధారంగా నిజం, అబద్ధం తేడా తెలుసుకోకుండా హైడ్రా కూల్చివేతలు చేస్తోందని, ఇటీవల సున్నం చెరువులో చేపట్టిన కూల్చివేతల మూలంగా చాలా మంది రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందుగానే సర్వే చేసి చర్యలు తీసుకుంటే బాగుండేది అని అన్నారు.

# కల్లు కంపౌండ్లపై ముప్పేట దాడులు..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

ఎక్సైజ్ బృందాలు కల్లు కంపౌండ్లపై దాడులను తీవ్రతరం చేశాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (STF), డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ (DTF), మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నాయి.

**నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు**

HDF ఏ టీం లీడర్ అంజి రెడ్డి బృందం, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 32 లీటర్ల అక్రమ కల్లును స్వాధీనం చేసుకుంది. ఒక బైక్‌ను సీజ్ చేసి, శాంపిల్స్ సేకరించారు. కాంబ్లే గిరిధర్‌పై కేసు నమోదు చేశారు.

**గోల్కొండ, షంషాబాద్‌లో తనిఖీలు**

STF సీ టీం, సీఐ వెంకటేశ్వర్లు నేతృత్వంలో గోల్కొండ, షంషాబాద్, బండ్లగూడ ప్రాంతాల్లో కల్లు కంపౌండ్లపై తనిఖీలు చేపట్టి, శాంపిల్స్ సేకరించారు. అదే విధంగా, సీఐ నాగరాజు బృందం మైలార్ దేవరపల్లి, హైదర్‌గూడ, ముద్దోవ్వాల, జంగంపేట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, అన్ని కల్లు దుకాణాల నుంచి శాంపిల్స్ సేకరించింది.



**గద్వాల, రాయన్‌పేటలో దాడులు**

STF బీ టీం, సీఐ బిక్షారెడ్డి మరియు ఎస్ఐ బాలరాజు బృందం గద్వాల, రాయన్‌పేట, ఏదుర్తి, మరియు మసాయిపేట ప్రాంతాల్లో ఆరు చోట్ల దాడులు నిర్వహించింది. అనుమతులు లేకుండా కల్లు దుకాణాలు నిర్వహిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. 595 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని, అవసరమైన శాంపిల్స్ సేకరించారు. మల్లయ్య, నరేందర్, కృష్ణ, వెంకటేష్, పద్మమ్మలపై కేసులు నమోదు చేసి, వారిని గద్వాల ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

**నాగర్‌కర్నూల్‌లో దాడులు**

నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ స్టేషన్ బృందం మంగూనూర్, బిజినేపల్లి ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, 350 లీటర్ల అనుమతి లేని కల్లును స్వాధీనం చేసుకుంది. అదే విధంగా, DTF సీఐ బృందం ఒక వాహనంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న 31.2 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసింది.



# జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**టీపీఎన్, హైదరాబాద్:**


తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించే బోనాల పండుగను పురస్కరించుకొని మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొట్టెల ఊరేగింపు ఘనంగా సాగింది. మేళతాళాల మధ్య మైసమ్మ తల్లి చిత్రంతో ఊరేగింపు కార్యాలయ ప్రాంగణాన్ని చుట్టేసింది. అనంతరం మేయర్ మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... "బోనాలు మన సంస్కృతిని, సమైక్యతను చూపించే పండుగ. ఉద్యోగుల భాగస్వామ్యంతో ఇలాంటి వేడుకలు జరగడం ఆనందంగా ఉంది. ఇది అందరికీ ప్రేరణగా నిలుస్తుంది" అని అన్నారు. సంప్రదాయ నృత్యాలు, వేషధారణలతో బోనాల సంబరాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్‌లో 2871 పాట్‌హోల్‌స్‌కు మరమ్మతులు

**టీపీఎన్, హైదరాబాద్:**

రహదారి భద్రతను మెరుగుపరచేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఇంటెన్సివ్ మెయింటెనెన్స్ డ్రైవ్ వేగంగా కొనసాగుతోంది. ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటివరకు గుర్తించిన 8380 పాట్‌హోల్‌స్‌లో మంగళవారం నాటికి 2871 గుంతలకు మరమ్మత్తులు పూర్తయ్యాయి. సోమవారం వరకు 2279 గుంతలు భర్తీ చేయగా, మంగళవారం ఒక్కరోజే 592 గుంతలను సిద్ధం చేశారు. పాట్‌హోల్‌స్‌తో పాటు 94 క్యాచ్‌పిట్లకు సేవలు అందించగా, అందులో 23 క్యాచ్‌పిట్ కవర్లను కొత్తవాటితో మార్చారు. అదనంగా 12 క్యాచ్‌పిట్ కవర్‌లు, రెండు మీడియం స్థాయి మరమ్మత్తులు కూడా చేపట్టినట్లు మెయింటెనెన్స్ చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్ తెలిపారు. పాట్‌హోల్స్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా నిర్ణీత కాలవ్యవధిలో మరమ్మత్తులు పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.




# ఘట్‌కేసర్‌లో బీజేపీ వర్క్‌షాప్..! కార్యకర్తలకు దిశానిర్దేశం..!

**టీపీఎన్, ఘట్‌కేసర్ :**

ఔషాపూర్‌లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా నల్లగొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో తన మొదటి పర్యటన చేశాను. వివిధ వర్గాల ప్రజలను కలిసి, గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలం పెరుగుతున్నట్లు గమనించాను. తెలంగాణ ప్రజలు బిజెపి ప్రభుత్వం కోరుకుంటున్నారు. గతంలో బిజెపికి ఒక ఎమ్మెల్యే, నలుగురు ఎంపీలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. ప్రతి ఎన్నికలో బిజెపి ఓటు శాతం, ప్రాతినిధ్యం స్థిరంగా పెరుగుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బిజెపి సిద్ధంగా ఉండాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు 10 శాతం మతపరమైన రిజర్వేషన్లను కలపాలని చూస్తోంది, ఇది బీసీలకు వ్యతిరేకమైన చర్య. గతంలో బిజెపి 4 శాతం మతపరమైన రిజర్వేషన్లను వ్యతిరేకించింది, కానీ కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ విధానాన్ని కొనసాగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలి. ప్రజల కోసం పోరాటం చేయాలి. ఒక్క ప్రాంతానికి పరిమితం కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా బిజెపి ఓటు శాతం పెరుగుతోంది. ఈ ఊపును మరింత బలోపేతం చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, భవిష్యత్తులో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించేలా కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.

# కోఠిలోని శ్రీ చైతన్య స్కూల్ ముందు తల్లిదండ్రుల ఆందోళన

టీపీఎన్, హైదరాబాద్ : గత 10 రోజులుగా కోఠిలోని శ్రీ చైతన్య స్కూల్ మూసివేయబడిందని, అడిగితే వేరే బ్రాంచ్‌లో చేరమని స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు స్కూల్‌కు అనుమతి లేనందున సీజ్ చేశారని, గత ఏడాది నుంచి స్కూల్ నడుస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని తల్లిదండ్రులు ప్రశ్నించారు. పుస్తకాలు, స్కూల్ ఫీజులు చెల్లించిన తర్వాత ఇప్పుడు వేరే బ్రాంచ్‌కు ఎలా వెళ్లాలని, స్కూల్ ఇంటికి దగ్గరగా ఉండటం వల్లే తమ పిల్లలను ఇక్కడ చేర్పించామని తల్లిదండ్రులు అన్నారు. తమ పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడిన శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



## నాగర్ కర్నూల్ జిల్లాలో దిశ కమిటీ సమావేశం: సంక్షేమ కార్యక్రమాల అమలుపై మల్లు రవి సమీక్ష

**టీపీఎన్, నాగర్ కర్నూల్:**

కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దిశ కమిటీ చైర్మన్, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బదవత్ సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు — సన్న బియ్యం, గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణాలు వంటి పథకాల అమలు పరిస్థితిపై అధికారులను వివరంగా ప్రశ్నించారు. ఏ శాఖలోనైనా ప్రజలకు సేవల అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బదిలీలకు సబ్సిడీ లోన్‌ల మంజూరులో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెస్ ఛార్జీల పెంపుతో గురుకుల విద్యార్థులకు పోషకాహార భోజనం అందుతోందా? అనే అంశాన్ని గురించి ఆరా తీశారు. గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను త్వరగా భర్తీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రక్తదానం చేయండి.. జీవితాలను కాపాడండి : కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**టీపీఎన్, కొత్తగూడెం :**

యువత రక్తదానం ను ఆదర్శంగా తీసుకొని రక్తదానం చేసి జీవితాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నేతృత్వంలో జిల్లా రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణంలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత రక్త పరీక్ష శిబిరంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రజలు తమ యొక్క బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. దీని ద్వారా అత్యవసర సందర్భాల్లో రక్తదానం చేసేందుకు సులభంగా ఉంటుందని, అత్యవసర సమయంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని కావున ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున ఈ ఉచిత రక్త పరీక్ష శిబిరం ని ఉపయోగించుకొని తమ యొక్క బ్లడ్ గ్రూపు వివరాలను తెలుసుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత రక్తదానం కార్యక్రమం ఆదర్శంగా తీసుకొని ఆపద కాలంలో రక్తదానం చేసి జీవితాలను నిలబెట్టాలని కలెక్టర్ కోరారు. ఈ రక్త పరీక్ష తేదీ కేంద్రంలో తాను కూడా రక్తపరీక్ష చేయించుకున్నానని అత్యవసర సమయంలో రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నానని కలెక్టర్ తెలిపారు. ఈ ఉచిత రక్త పరీక్ష శిబిరం ద్వారా తమ బ్లడ్ గ్రూపు ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఇలా తెలుసుకోవడం ద్వారా ఎదుటి వ్యక్తికి సహాయం చేయడమే కాకుండా తన యొక్క బ్లడ్ గ్రూప్ పై అవగాహన ఉండటం స్వీయ సంరక్షణకు కూడా ఉపయోగపడుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు తమ యొక్క బ్లడ్ గ్రూప్ సంబంధిత వివరాలను తప్పనిసరిగా తెలుసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో వెంకటరమణ,మనోహర్, వెంకట పుల్లయ్య, డీఎస్పీ రెహమాన్, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, ఆటో డ్రైవర్లు మరియు కార్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు



## ముదిగొండ ఎస్టీ బాలికల హాస్టల్‌లో విషాహార ఘటనపై హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

**టీపీఎన్, నల్గొండ:**

దేవరకొండ మండలం ముదిగొండలోని ఎస్టీ బాలికల గురుకుల హాస్టల్‌లో విష ఆహార ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ఘటనపై జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, న్యాయవాది దుంద్ర కుమారస్వామి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌లో 40 మంది బాలికలు ఉంటుండగా, వారిలో 35 మంది చికెన్ కర్రీ, పులిహోర తిన్న అనంతరం వాంతులు, విరేచనాల బారిన పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిలో 30 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత ఏర్పడినట్లు, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ సంఘటన విద్యార్థుల ఆరోగ్య హక్కులను తీవ్రంగా ఉల్లంఘిస్తోందని కుమారస్వామి విమర్శించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి జీవించేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు హక్కు కలిగినప్పటికీ, ఆ హక్కు బాలికలపై చూర్నవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని, స్వతంత్ర కమిటీ ద్వారా పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందిస్తూ, ఈ విషయంపై ఆగస్టు 28లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.



## గంజాయి స్మగ్లర్‌ను పట్టుకున్న రామచంద్రాపురం పోలీసులు

**టీపీఎన్, రామచంద్రాపురం :**

ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఓ స్మగ్లర్‌ను రామచంద్రాపురం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 8 కిలోల గంజాయిని, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బిదర్ జిల్లా, ఔరద్ సబ్ డివిజన్, మన్‌హళ్లి గ్రామానికి చెందిన ఖాజా మియా కుమారుడు ఖురేషీ షబ్బీర్ అలీ (21) ఒడిశా నుంచి 8 కిలోల గంజాయిని తీసుకువచ్చి రామచంద్రాపురం ఏరియాలో కొంతమంది కస్టమర్లకు అమ్మేందుకు వచ్చాడు. పారగాన్ చెప్పుల కంపెనీ, ఇక్రిశాట్ ముందు నిందితుడు గంజాయితో ఉండగా రామచంద్రాపురం పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బోనాల చెక్కుల పంపిణీ రసాభాస..!



**టీపీఎన్, ఆల్వాల్ :**

బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం అల్వాల్‌లో రసాభాసగా మారింది. అల్వాల్ లో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చెక్కులు పంపిణీ చేస్తున్న క్రమంలో బిఆర్ఎస్ కార్పొరేటర్ కు స్టేజ్ పైన రానివ్వకపోడంతో ఒకసారిగా వివాదం చెలరేగింది.మైనంపల్లి హనుమంతరావు,మర్రి రాజశేఖర్ రెడ్డి వర్గీయుల మధ్య తలెత్తిన ఘర్షణ దాడులకు దారితీసింది. ఇరు వర్గాలకు చెందిన నాయకులు ఒక్కసారిగా దాడులకు దిగడంతో పాటు పోటా పోటీ నినాదాలు చేసారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో చెక్కుల పంపిణీ కోసం వచ్చిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అక్కడి నుండి వెను తిరిగారు. ఈ ఘర్షణలో కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి.



## మంచినీటి సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

**టీపీఎన్, శామీర్ పేట్ :**

అలియాబాద్ మున్సిపల్ పరిధి లోని లాల్ గడి మలక్ పేట్ లోని మాల బస్తీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ కు కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ లాల్‌గడి మలక్‌పేటలో దాదాపు 120 కుటుంబాలు నివాసం ఉండే మాలబస్తీలో మంచినీటి సమస్య తీవ్రంగా వెంటాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 4 నెలలుగా మంచినీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని, పంచాయతీ కార్యదర్శికి, వాటర్ మెన్‌కు సమస్య వివరించిన తాత్కాక పరిష్కారం తప్ప ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. నీటి సమస్యతో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన మాలబస్తీలో నీటి సమస్యను తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

## బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్ మను చౌదరి

**టీపీఎన్, శామీర్‌పేట్:**



తుర్కపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కాలేజీలను మంగళవారం జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫార్ములు, నోట్‌బుక్స్ అందరికీ వచ్చాయా, భోజనం బాగుందా, చదువు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులన్నీ అర్థమవుతున్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు.విద్యార్థులు నీటి ట్యాంక్ మరమ్మతుల వల్ల తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, డోర్లు, ఫ్యాన్లు పనిచేయకపోవడం, భోజనం నాణ్యతపై అసంతృప్తి వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ నీటి ట్యాంకు మరమ్మతులు తక్షణమే చేపట్టాలని, తిండి తయారీకి అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం ఉండాలని, డోర్లు, ఫ్యాన్లను రిపేర్ చేయించాలని సూచించారు. వంటగదిని పరిశీలించిన కలెక్టర్ శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దోమలు, ఈగలు రాకుండా శానిటేషన్ నిర్వహణ మేలు చేయాలని, బియ్యం, కూరగాయలను బాగా కడగాలని, వంట తీరు పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులకు కష్టంగా ఉన్న సబ్జెక్టులపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని, చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించిన కలెక్టర్, బాధ్యతాయుతంగా పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి రెడ్డి, హెడ్‌మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్ ,పెన్నులు పంపిణీ

**టీపీఎన్, మేడ్చల్ :**

మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షయ సమృద్ధి ఫౌండేషన్ చైర్మన్ ములంగారి శ్రీహరి చారి ఆధ్వర్యంలో 350 మంది విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి చారి మాట్లాడుతూ అక్షయ ఫౌండేషన్ పేద మధ్యతరగతి ప్రభుత్వ విద్యార్థిలకు ఉచితంగా నోట్ బుక్స్ పెన్సిల్ పెన్నులు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. అదే విదంగా ప్రతి సోమవారం మేడ్చల్ అంబేద్కర్ విగ్రహం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో ఉన్న మనం సమాజ సేవ పనిచేసే వారికి ఆర్థికంగా అన్ని విధాల ఎంతో కొంత సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, నాయకులు రాజశేఖర్ రావు, సానాల విష్ణు చారి, తాళ్లపల్లి శ్రీనివాస్ గుప్తా, పాతూరి సుదాకర్ రెడ్డి, రాజు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో టీడీపీ నూతన పట్టణ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**టీపీఎన్, భద్రాచలం:**

నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గోదావరి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర నాయకత్వం తరపున నియమితులైన నియోజకవర్గ పరిశీలకులు వట్టం నారాయణ దొర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పోటు రంగారావు, కొడాలి శ్రీనివాస్, కుంచాల రాజారాం, కంభంపాటి సురేష్, పిల్లంటి దేశప్ప, అభినేని శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, వాసిరెడ్డి చలపతిరావు, నూతలపాటి దాసయ్య పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ నేతలు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిలో భాగంగా తెలుగుదేశం పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. భద్రాచలం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజలకు లాభదాయకంగా ఉన్నాయని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీకి విధేయంగా ఉండటం తెలుగుదేశం పార్టీ కుటుంబానికి మాత్రమే చెల్లిన ప్రత్యేకత అని కొనియాడారు. క్రమశిక్షణతో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. సమావేశం అనంతరం భద్రాచలం తెలుగుదేశం పార్టీ




మండల కమిటీని వట్టం నారాయణదొర సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా తాళ్లూరి చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా రేపాక రాంబాబును ఎన్నుకున్నారు. కొత్త కమిటీ పార్టీ బలోపేతానికి చురుగ్గా పని చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

- ఖండతరాలు దాటిన తిరుమల విద్యాసంస్థలు...
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ... గుజరాత్ నుంచి మిజోరామ్, నాగాలాండ్ వరకూ...
- ఐఐటీ, ఎన్ఐటీ, బిట్స్‌లో వేలాదిమంది తిరుమల విద్యార్థులే..
- అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ 700మందికి పైగా ఉన్నత ఉద్యోగాల్లో..
- త్వరలో విశ్వవిద్యాలయంగా మారనున్న తిరుమల విద్యా సంస్థ



# వికసించిన తిరుమల కుసుమాలు..!

భారత దేశంలో ఇటు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ అటు గుజరాత్ నుండి మేఖాలయ, అస్సాం, అరుణాచలప్రదేశ్ ప్రాంతాలైన మిజోరామ్, మణిపూర్, నాగాలాండ్ వరకూ అంటే మొత్తం భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో గల ఐఐటీ, ఎన్ఐటి, ఐఐఐటి (ట్రిబుల్ ఐఐటి), బిట్స్ వంటి పేరెన్నికగన్న టాప్ విద్యా సంస్థల్లో తిరుమలకు చెందిన సుమారు 4వేలకు పైగా విద్యార్థులు అభ్యసిస్తూ తిరుమల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. గత రెండేళ్ళ క్రితమే దేశంలోని అన్ని ఐఐటిల్లో తిరుమల విద్యార్థులు 1126సీటు సాధించగా 2301మంది, ట్రిబుల్ ఇబబటిలో 380 మంది, బిట్‌స్‌లో 95 మంది వెరసి దేశవ్యాప్తంగా 3902 నుంచి తిరుమల విద్యార్థులు సీట్లు సాధించారంటే తిరుమల విద్యా సంస్థ ఖ్యాతి ఏ రేంజ్ లో ఉందో స్పష్టమౌతుంది. ఈ సమయంలో గత రెండేళ్ళలోపువి. అప్పటి నుండి ఈ విద్యా సంవత్సరం జతచేస్తే సుమారు 7వేల మంది విద్యార్థుల వరకూ దేశంలో అన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ తిరుసుల విద్యార్థులు హవా కొనసాగుతుందనే చెప్పాలి. దేశంలో ఉన్న ఐఐటి, ఎన్ఐటి, ట్రిబుల్ ఐఐటి, బిల్స్ వంటి అన్ని విద్యా సంస్థల్లోనూ ఒకే సంస్థకు చెందిన విద్యార్థులు ఉండటం అసంభవం. అలాగే అమెరికా నుండి ఆస్ట్రేలియా వరకూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐటి కంపెనీల్లో తిరుమల విద్యార్థుల ఉద్యోగాలు సంపాదించారు. ఈఘనత కేవలం ఒక్క తిరుమల విద్యా సంస్థలకే తగ్గింది అనడంలో అతిశయోక్తిలేదనే చెప్పాలి. ఏదైనా విద్యా సంస్థ విజయాలు సాధించినా, ఆ సంస్థలోని విద్యార్థులు ఉన్నతంగా రాణించినా ఆ ప్రాంతం వరకే తెలుస్తుంది. అయితే ఒక విద్యా సంస్థలోని విద్యార్థులు దేశంలోని కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ గుజరాత్ నుండి మిజోరామ్, నాగాలాండ్ వరకూ దేశం అంటే నలుమూలలుగా ఉన్న దేశం ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటి, బిట్‌స్‌లో వేలాది మందికి పైగా విద్యార్థులు ఒకే సంస్థకు చెందిన వారు ఉన్నారంటే ఆ విద్యా సంస్థ ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో స్పష్టమౌతుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి సమీపంలోని కాతేరులో ఉన్న తిరుమల విద్యా సంస్థలోని విద్యార్థులు ఒక్క భారతదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా వందల సంఖ్యలో ఉన్నారంటే తిరుసుల సంఖ్య స్టాండర్స్ ఏ స్థాయిలో ఉన్నాయో తేటతెల్లమవుతుంది. అమెరికా నుండి ఆస్ట్రేలియా వరకూ ప్రఖ్యాత యూనివర్శిటీల్లో ఉన్నత చదువులు కాకుండా ప్రపంచంలోనే ప్రఖ్యాత గాంచిన ఇది టెక్నాలజీ కంపెనీల్లో కూడా విద్యార్థులు ఉద్యోగాలు చేస్తున్నారంటే తిరుమల ఖ్యాతి ఖండాంతరాలు



దాటింది అనడంలో అతిశయోక్తి లేదు. త్వరలో తిరుమల విశ్వవిద్యాలయం దిశగా తిరుమల విద్యా సంస్థలు మారనున్నాయి.


తిరుమలలోని వెంకటేశ్వరుని సన్నిధిని వైకుంఠంతో పోలుస్తారు... అందుకనే తిరుమలని ఆనందనిలయంగా భక్తజనకోటి. భావిస్తున్నారు. ఒక్కసారి కలియుగదైవమైన శ్రీవేంకటేశ్వర స్వామిని వీక్షిస్తే జన్మచరితార్ధంగా భావించి పులకరించి ఆధ్మాతికతో తరిస్తారు... అయితే రాజమహేంద్రవరంలోని గోదావరి తీరంలో ఉన్న తిరుమల విద్యా సంస్థలో తమ పిల్లలను చేర్చుకుంటే అదే తమ పిల్లల భవిష్యత్‌కు కొండంత భరోసాగా నిలుస్తోందనీ తల్లిదండ్రులు భావిస్తున్నారు. తిరుమల అంటేనే పవిత్రమైనదని (తిరు అంటే పవిత్రమైన మల అంటే కొండ అని అర్ధం) అంటారు. (యాదృశ్చికమో లేదా కాకతాళీకమో గాని తిరుమల విద్యా సంస్థల అధినేత పేరుకూడా తిరులమలరావే... అందుకనే పవిత్ర తిరుపతిని నిత్యం స్మరించేలాగ తిరుపతిలో ఉన్న ఏడు కొండలకు కున్న పేర్లను కూడా తిరుమల విద్యా సంస్థలోని భవనాలకు నామకరణం చేశారు... తిరుమల అంటేనే ఆధాత్మికతకు ప్రతీక.. అదే తిరుమల విద్యాసంస్థలోనూ ఉంచాలంటే నున్న తిరుమలరావు (ఎన్.టి.ఆర్) తో పాటు తిరుమల విద్యా సంస్థ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక బృందంలో ఏఒక్కరూ కూడా మద్యం అనేది ముట్టరంటే అధ్యాపకుల ఎంపికపై తిరుమలరావు శ్రద్ధగా ఉందో అర్ధం చేసుకోవచ్చు... సర్వసాధారణంగా విద్యా వ్యాపారం చేసేవారు ఒక వ్యాపార దృక్పథంతో చూస్తారు. అయితే దీనికి భిన్నంగా తిరుమలరావు నిత్యం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూనే ఉంటారు. సాధారణంగా పేరెనికగన్న విద్యా సంస్థల్లో సీటు కోసం ప్రముఖుల సిఫార్సులు సర్వసాధారణం. అయితే తిరుమలకు కూడా ప్రముఖుల సిఫార్సులు తాకిడి ఎంతో ఎక్కువగానే ఉంటుంది. అయితే దీనికి భిన్నంగా, తిరుమలరానే స్వయంగా ప్రముఖులకు, ప్రజా ప్రతినిధులకు, బడా వ్యాపారవేత్తలకు ముందుగానే ఫోన్లు చేసి తమ విద్యాసంస్థలోని సీట్లు అన్నీ అయిపోయాయి.. దయ ఉంచి సిఫార్సులు లేఖలు, ఫోన్లు చేయవద్దంటూ అభ్యర్ధిస్తున్నారంటే తిరుమలలో సీటు పొందాలంటే తల్లిదండ్రులు ఎంత కష్టపడాలో స్పష్టం అవుతుంది. అలాగని వచ్చిన ప్రతీ విద్యార్థికి తిరుమల విద్యాసంస్థలో చోటు దక్కే పరిస్థితి ఉండదనే చెప్పాలి. ఇతర ప్రాంతాల నుండి ఇతర విద్యాసంస్థల నుండి వచ్చిన విద్యార్థులకు ఒకటికి రెండుసార్లు విద్యార్థి సామర్ధ్యంపైనా, సబ్జెక్టా " పరీక్షలు నిర్వహించి ప్రాథమిక పరీక్షల ద్వారా వడబోసి సీట్లు కేటాయిస్తారు. అందుకనే రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ అయినా, వైద్య, పాలిటెక్నికల్, నీట్, ఐఐటి అయినా మొదటి పది ర్యాంకులు, అలాగే మొదటి 100 ర్యాంకుల లోపు తిరుమల విద్యార్థులు ఉండితీరాల్సిందే అంటున్నారు తల్లిదండ్రులు... తి



రుమలలో చేరితే విద్యార్థులను ఉతికి ఆరేస్తారు. ఉదయం నుండి రాత్రి వరకూ తోమేస్తారు అని ఇతర విద్యాసంస్థల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ తల్లిదండ్రులు మాత్రం విద్యా తిరుమల సంస్థలపై గిట్టనివారు చేసే దుష్ప్రచారాలు తప్ప తమ పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచి ర్యాంకులు సాధించే విధంగా కృషిచేస్తున్న తిరుమల సేవలను బహిరంగంగానే కొనియాడుతున్నారు. ఇక పాఠాలు చెప్పే అధ్యాపక బృందాన్ని కూడా తిరుమలరావు ఎంతో గౌరవంగానే చూస్తారు. అధ్యాపకులు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలకు పాఠాలు బోధిస్తారనే ఉద్దేశ్యంతో అధ్యాపకుల ఆరోగ్యం కోసం కూడా జిమ్ ఏర్పాటుచేశారంటే అధ్యాపకులు శ్రేయస్సు కూడా ఆయన ఏ స్థాయిలో పర్యవేక్షిస్తారో స్పష్టమౌతుంది. సర్వసాధారణంగా ప్రతీ ప్రయివేట్ స్కూల్ విద్యాసంస్థలు పునఃప్రారంభానికి నెలరోజుల నుండి ఆయా విద్యా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, బోధనా సిబ్బందికి కూడా టార్గెట్స్ ఇచ్చి ఇంటింటికి తిరిగి అడ్మిషన్లు చేస్తారు. కొన్ని సందర్భాల్లో అడ్మిషన్స్ చేయించని అధ్యాపకులను కొనసాగించకుండా నిలిపివేసిన దాఖలాలు కూడా కోకొల్లలు.. అయితే దీనికి విరుద్ధంగా తిరుమలలో పనిచేసే శిక్షణ బృందం గానీ, రిప్రజెంటేటివ్స్ గాని ఏ ఒక్క విద్యార్థి ఇంటికి వెళ్లి తమ స్కూల్లో చేర్పించాలనీ చెప్పిన దాఖలాలు లేవనే చెప్పాలి.

**నిత్యం సందడి**

పిల్లలను స్కూల్లో జాయిన చేశాము.. ఫీజులు కట్టేసాం... బస్సు ఫీజులు చెల్లించాము... విద్యాసంవత్సరం వరకూ మనం స్కూలు వంద చూడనవసరం లేదు ..... మనం చూసుకోఅబ్బ




ర్లద్దు అని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అయితే తిరుమల విద్యా సంస్థలో మాత్రం ప్రతీ విద్యార్థి నడవడికి, చదువు, సంస్కారం పై నిత్యం ఆరా తీయడమే కాకుండా చదువులో వెనుకబడినా, ప్రవర్తనలో తేడా వచ్చినా స్వయంగా తిరుమలరావు విద్యార్థికి క్లాసు పాడతారు. అందుకనే వేలాది మంది విద్యార్థులు పేర్లు కూడా తిరుమలరావు గుర్తుపెట్టుకుని చెప్పగలరంటే విద్యార్థులతో ఆయన మమేకమయ్యే పద్దతి ఏ స్థాయిలో ఉందో అర్ధమవుతుంది. పొరపాటున ఏ విద్యార్థి అయినా క్రమశిక్షణ తప్పి మాట వినకపోతే తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థి ఎదురుగానే చెబుతారు. అనంతరం కూడా విద్యార్థి ఎలా నడుస్తున్నాను. నడవడిక, అల్లరి, చిల్లర పనులపై తిరుమలలో అధ్యాపకులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. అందుకనే తిరుమల స్కూల్లో తమ పిల్లలను జాయిన్ చేస్తే నిత్యం తిరుమల నుండి అనుబంధం ఉన్నట్టుగానే తల్లిదండ్రులు భావిస్తాడు...

**నిరాడంబరతే ఆయన గుర్తింపు...**

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విశాఖ, విజయవాడ, హైద్రాబాద్ వంటి ప్రాంతాలకు తిరుమల విద్యాసంస్థ సుపరిచితమే. అయితే ఆయా ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు నర్సరీ నుండి తిరుమలలో చదివినవారే...ఒకవైపు ఎంబీబీఎస్, నీట్, మరొకవైపు ఇంజనీరింగ్, ఐఐటిల్లో వేలాది ర్యాంకులు



సాధించిన విద్యార్థులు నేడు దేశం, విదేశాల్లో చదువుతూ ఇండియా వచ్చిన ప్రతీసారి తిరుమలరావు సార్ నీ కలవందే వెళ్లరంటే విద్యార్థులతో తిరుమలరావుకు ఉన్న అనుబంధం ఎలా ఉందో అర్ధం చేసుకోవచ్చు. ఎంత ఎత్తుఎదిగినా ఒదిగుండాలంటే సామెత తిరుమలరావుకు సరిగ్గా సరిపోతుందని తల్లిదండ్రులు కితాబిస్తారు.



# శుభాంశు శుక్లా బృందానికి ప్రధాని మోదీ వెల్‌కమ్..!

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సురక్షితంగా భూమిపైకి చేరుకున్న శుభాంశు శుక్లా బృందానికి ప్రధాని మోదీ స్వాగతం పలికారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామి శుక్లా అని ఆయన పేర్కొన్నారు. కోట్లాది మందికి ఆయన అంకితభావం, ధైర్యం, స్ఫూర్తి ప్రేరణ అందిస్తుందన్నారు. గగన్‌యాన్‌కు ఈ యాత్ర మరో మైలురాయి అవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు. గత నెల జూన్ 25వ తేదీన ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ యుజాన్‌స్కీ విష్నేవ్‌స్కీ,టైబోర్ కపుతో కలిసి శుభాంశు శుక్లా.. యాక్సియం 4 మిషన్‌లో భాగంగా స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్9 రాకెట్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనమయ్యారు. అమెరికాలోని ఫ్లోరిడాలో నాసా కెన్నడీ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ కాంప్లెక్స్ నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఇక గతంలో శుభాంశు శుక్లా చేయవలసిన ఈ అంతరిక్ష యాత్ర పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. చివరకు జూన్ 25వ తేదీ మధ్యాహ్నం 12. 01 గంటలకు యాక్సియం 4 మిషన్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరి వెళ్లింది. దాదాపు 18 రోజుల అనంతరం కాలిఫోర్నియాలో శాన్‌డియాగో తీరంలో డ్రాగన్ అంతరిక్ష నౌక గ్రేస్‌లో మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలకు శుభాంశు శుక్లా బృందం సురక్షితంగా దిగింది.





## విద్యార్థినిపై లెక్చరర్ల లైంగిక దాడి..!

**టీపీఎన్, బెంగళూరు :**

బెంగళూరులో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ ప్రయివేట్ కళాశాల విద్యార్థినిపై ఇద్దరు లెక్చరర్లు, వారి స్నేహితుడు లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిజిక్స్ లెక్చరర్ నరేంద్ర, బయోలజీ లెక్చరర్ సందీప్ వారి స్నేహితుడు అనూప్ నగరంలోని ఓ కళాశాలలో పని చేస్తున్నారు. ఈ క్రమంలోనే నరేంద్ర ఓ విద్యార్థినితో పరిచయాన్ని పెంచుకున్నాడు. ఆమెను నమ్మబలికి బెంగళూరుకు రప్పించి తన స్నేహితుడి ఇంట్లో మొదటగా లైంగిక దాడి చేశాడు. ఈ ఘటనను వీడియో తీసిన సందీప్ విద్యార్థినిని బ్లాక్ మెయిల్ చేసి మళ్లీ లైంగిక దాడి చేశాడు. అనూప్ సైతం సీసీటీవీ ఫుటేజీలు ఉన్నాయని బెదిరించి తనుకూడా అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నెల రోజుల క్రితం ఈ ఘటన జరగగా బాధిత కుటుంబం కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో వెలుగులోకి వచ్చింది. మహిళా కమిషన్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.



## రోడ్డు ప్రమాదంలో పంజాబ్ మారథాన్ రన్నర్ మృతి

**టీపీఎన్, జలంధర్ :**

ప్రపంచంలోని అత్యంత వృద్ధ మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ జలంధర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించారు. పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలోని తన స్వగ్రామంలో నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని చనిపోయారు. ఫౌజా సింగ్ మరణం పట్ల పంజాబ్ గవర్నర్ ,చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ గులాబ్ చంద్ కటారియా సంతాపం తెలిపారు. మారథాన్ రన్నర్ పట్టుదలకు ప్రతీక సర్దార్ ఫౌజా సింగ్ మరణం తీరని లోటు అని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ X లో గవర్నర్ విచారం వ్యక్తం చేశారు.

## నా చావుకు నా భార్య, ఆమె ప్రియుడే కారణం..
# సెల్ఫీ వీడియోలో ఆవేదన

**టీపీఎన్, ఉజ్జయిని :**



మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని చిమ్మన్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక షాకింగ్ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఈ మేరకు సూసైడ్ కు ముందు సెల్ఫీ వీడియోలో తన బాధను వ్యక్తం చేశాడు. తన భార్య, అత్త, భార్య ప్రియుడు వేధింపులకు తట్టుకోలేకనే బలవన్మరణానికి పాల్పడ్డానని ఆరోపించాడు. తన భార్య కూడా తన పిల్లల నుండి తనను దూరం చేసిందని ఆ యువకుడు చెప్పాడు. తాను చేసిన పాపాలకు భగవంతుడు క్షమించాలని వేడుకున్నాడు. మృతుడు తన్వీర్ తన తండ్రి సత్తార్ తో కలిసి జీవనోపాధి కోసం కూలీగా పనిచేసేవాడు. సోమవారం సాయంత్రం ఉరి వేసుకునే ముందు, అతను ఒక వీడియోను తీసి తన కుటుంబానికి పంపాడు. ఆ వీడియోలో, తన భార్య తంజిలాకు సోను అలియాస్ సఫీక్ ఖురేషితో వివాహేతకర సంబంధం ఉందని, ఆమె గత ఒక నెల రోజులుగా అతనితో నివసిస్తుందని తన్వీర్ ఆవేదన వ్యక్తం చేశారు. తన మరణానికి కారణమైన ముగ్గురిని కఠినంగా శిక్షించాలని తన్వీర్ వీడియోలో డిమాండ్ చేశాడు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి సెల్ఫీ వీడియోను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాక్ష్యాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## వారణాసిలో వరద బీభత్సం

**టీపీఎన్, వారణాసి :**

ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో వరదలు బీభత్సం సృష్టించాయి, గంగా నదికి వరద ఉధృతి అంతకంతకు పెరుగుతండటంతో ఘాట్ ల వగ్గర సెల్ఫీలు, పడవలు నిషేధించబడ్డాయి. నది నీటిమట్టం పెరగడంతో 84 ఘాట్ లు మునిగిపోయాయి. పడవ కార్యకలాపాలు నిలిపివేయబడ్డాయి. వరద ప్రవాహం పెరగడంతో భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉన్నాయి.. భద్రతా ప్రయోజనాల దృష్ట్యా ఘాట్ ల దగ్గర నిరంతరం పోలీసులను మోహరించారు.



## ఆర్మీపై వ్యాఖ్యల కేసులో రాహుల్‌గాంధీకి
# బెయిల్ మంజూరు..!

**టీపీఎన్, లక్నో :**

ఇండియన్ ఆర్మీపై పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న కేసులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కి ఊరట లభించింది. ఆయనకు ఎంపీ/ ఎమ్మెల్యే కోర్టు మంగళవారం నాడు బెయిలు మంజూరు చేసింది. రూ.20,000 వ్యక్తిగత పూచీకత్తు, రెండు ష్యూరిటీలు సమర్పించాలని అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అలోక్ వర్మ ఆదేశించారు. తదుపరి విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేశారు. రాహుల్ మంగళవారం నాడు కోర్టు ముందు హాజరు కాగా, గతంలో ఐదు పర్యాయాలు ఆయన విచారణకు గైర్హాజరయ్యారు. 2020లో భారత్, చైనా బలగాల మధ్య ఘర్షణల సమయంలో భారత సైనికుల మనోభావాలను దెబ్బతీసేలా రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాత్సవ ఈ పిటిషన్ వేశారు. భారత్ జోడో యాత్ర సమయంలో సరిహద్దుల్లోని పరిస్థితిని రాహుల్ ప్రస్తావిస్తూ, అరుణాచల్ ప్రదేశ్‌లో భారత సైనికులను 'కొడుతుంటే' మీడియా ఎలాంటి ప్రశ్నలు వేయడం లేదని అన్నట్టు పిటిషనర్ పేర్కొన్నారు. భారత సైనికుల మనోభావాలను రాహుల్ దెబ్బతీశారని ఆరోపించారు. విచారణకు హాజరయ్యేందుకు రాహుల్ గాంధీ లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి ఉదయం చేరుకున్నప్పుడు ఆయనకు కాంగ్రెస్ కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన కోర్టుకు హాజరయ్యారు. సుమారు గంట సేపు కోర్టులో ఉన్నారు. లక్నో హైకోర్టు తనకు జారీ చేసిన సమన్లను కొట్టివేయాలని రాహుల్ చేసిన విజ్ఞప్తిని అలహాబాద్ హైకోర్టు ఇంతకుముందు కొట్టివేసింది.

## సిగరెట్ల తరహాలో సమోసా,
# జిలేబీలకు వార్నింగ్ లేబుల్స్..!

**టీపీఎన్, న్యూఢిల్లీ ;**

సిగరెట్ల తరహాలో సమోసా, జిలేబీ, లడ్డూ వంటి ఆహార ఉత్పత్తులపై వార్నింగ్ లేబుల్స్ ఇచ్చేందుకు ఎటువంటి ఆదేశాలు లేవని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ తరహా పదార్థాల్లో ఉన్న కొవ్వు, చక్కెర స్థితి, వివిధ హానికరమైన వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మాత్రమే క్యాంటీన్లు, హోటళ్ల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలనే సలహా మాత్రమే ఇచ్చామని తెలిపింది. వాటిపై హెచ్చరిక లేబుల్స్ ఉన్నట్టు మీడియాలో వెలువడిన కథనాలు తప్పు దారి పట్టించేవి, నిరాధారమైనవని తోసిపుచ్చింది. అటువంటి ఉత్తర్వులు తాము ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఏ ఆహార పదార్థంపైనా హెచ్చరిక లేబుల్‌లను ఉంచబోమని తెలిపింది. ప్రజలు నూనె లేదా తీపి స్నాక్స్‌కు బదులుగా ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సలహా జారీ చేశామని పేర్కొంది. వీధి వ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాలను లేబుల్ చేయడం లేదా టార్గెట్ చేస్తూ ఎటువంటి చర్య తీసుకోలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. వార్నింగ్ లేబుల్స్‌కు బదులుగా.. ఆరోగ్యకరమైన ఆహార ఎంపికలను ప్రోత్సహించే లక్ష్యంతో ఒక ఆరోగ్య సలహాను జారీ చేసింది. సిగరేట్ల మాదిరిగా సమోసా, జిలేబీలపైనా హెచ్చరిక సందేశాలు ఇవ్వనున్నారని జరుగుతున్న ప్రచారంపై కేంద్రం క్లారిటీ ఇచ్చింది.



# జై శంకర్ పై రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజం

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

విదేశాంగ మంత్రి జై శంకర్ చైనా పర్యటనపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జిన్ పింగ్ తో సమావేశంపై అసహనం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ కు డ్రాగన్ దేశం మద్దతు తెలిపిందని..యుద్ధంలో సాయం చేసిందని ఆరోపించారు. అలాంటి దేశాధ్యక్షుడితో కరచాలనం చేయడంపై జైశంకర్ విదేశాంగ విధానాన్ని నాశనం చేసే సర్కస్ గా అభివర్ణించారు. ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి వచ్చి ప్రధాని మోదీకి చైనా, భారత్ సంబంధాలలో తాజా పరిణామాల గురించి వివరిస్తారని తాను అనుకుంటున్నానని తనదైన శైలిలో సోషల్ మీడియా ఎక్స్ లో సెటైర్స్ వేశారు.

**జైరాం రమేష్ ఏం చెప్పారు?**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేష్ మాట్లాడుతూ, భారత్‌పై పోరాడేందుకు చైనా పాకిస్తాన్‌కు ఆయుధాలు, డ్రోన్‌లు, నిఘా సమాచారాన్ని అందించిందని అన్నారు. చైనా తన ఆయుధాలను పరీక్షించుకోవడానికి ఈ ఆపరేషన్‌ను ఉపయోగించుకుందని కూడా ఒక సీనియర్ ఆర్మీ అధికారి అన్నారని తెలిపారు.



# భర్తను హత్య చేసి మృతదేహాన్ని ఇంట్లో పూడ్చిపెట్టిన భార్య

**టీపీఎన్, పాండు :**

అస్సాంకు చెందిన రహీమా ఖాతున్ తన భర్తను హత్య చేసి ఇంట్లోనే పాతిపెట్టింది. మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. విచారణలో నిందితురాలు రహీమా ఖాతున్ తన నేరాన్ని అంగీకరించింది. జూన్ 26న అస్సాం రాజధాని పాండు ప్రాంతంలోని జోయ్‌మతి నగర్‌లోని దంపతుల మధ్య గొడవ జరిగింది. మాటమాట పెరిగి ఇంట్లోనే ఘర్షణకు దిగారు. కోపంతో రహీమా తన భర్తపై దాడి చేసింది. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. కొంత సమయం తర్వాత, సబిల్ రెహమాన్ మరణించాడు. రహీమా ఇంటి లోపల 5 అడుగుల లోతు గుంత తవ్వి తన భర్త మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. వీరిద్దరికీ 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెహ్మాన్ చాలా రోజులుగా కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారికి అనుమానం వచ్చింది. విచారణలో రహీమా మొదట తన భర్త పని కోసం కేరళకు వెళ్లాడని చెప్పింది. తర్వాత తన మాట మార్చింది. తన భర్త ఆరోగ్యం బాగాలేదని, ఆసుపత్రికి వెళ్లాడని చెప్పింది. రెహ్మాన్ సోదరుడు జులై 12న జలుక్‌బరి పోలీస్ స్టేషన్‌లో కనిపించకుండా పోయిన సోదరుడి ఆచూకి తెలుసుకోవాలని ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు రహీమా పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయింది. భర్తను తానే చంపినట్టు ఒప్పుకుంది. తన భర్త గొడవ తర్వాత చనిపోయాడని రహీమా చెబుతోంది. తర్వాత ఆమె భయపడి అతని మృతదేహాన్ని ఇంటి ఆవరణలో పాతిపెట్టిందని పశ్చిమ గువాహటి డీసీపీ పద్మనవ్ బారువా తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు, మేజిస్ట్రేట్‌తో కూడిన పోలీసు బృందం వారి ఇంట్లోని గొయ్యి నుండి కుళ్ళిపోయిన స్థితిలో సబియాల్ రెహమాన్ మృతదేహాన్ని వెలికితీసింది. రహీమా ఒంటరిగా ఈ నేరం చేసి ఉండకపోవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. 'ఒక మహిళ ఒంటరిగా ఇంత పెద్ద గొయ్యిని తవ్వడం అసాధ్యం. ఇతర అనుమానితుల ప్రమేయంపై మేము దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ అన్నారు.



# శుభాన్షు శుక్లా అంతరిక్షంలో ఏం చేశాడు..? ఎలాంటి ప్రయోగాలు చేశాడు?

**టీపీఎన్, కాలిఫోర్నియా :**

భారత వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)లో తన 18 రోజుల చారిత్రాత్మక పర్యటనను పూర్తి చేసుకుని విజయవంతంగా భూమికి తిరిగి వచ్చారు. స్పేస్ఎక్స్ డ్రాగన్ కాప్సూల్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరిన ఆయన కాలిఫోర్నియా తీరంలో దిగారు. ఇది అతని మొదటి అంతరిక్ష ప్రయాణం. ఇది ఆక్సియమ్ మిషన్ 4 (యాక్స్4)లో భాగం. ఈ సమయంలో అతను శాస్త్రీయ ప్రయోగాలు చేయడమే కాకుండా భారతదేశ అంతరిక్ష కార్యక్రమానికి అనుభవాన్ని కూడా సేకరించాడు. ఈ 18 రోజుల్లో శుభాన్షు ఏమి చేసాడో మరియు అతను ఏ ప్రయోగాలు నిర్వహించాడో తెలుసుకుందాం.



**ISS లో శుభాన్షు ప్రయాణం**

శుభాన్షు శుక్లా ఈ ఏడాది జూన్ 25 న ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి స్పేస్ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌పై ప్రయోగించి జూన్ 26న భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:01 గంటలకు ISSకి కనెక్ట్ అయ్యారు. ఆయన మొదటిసారి ISSకి చేరుకున్న మొదటి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. ఈ 18 రోజుల ప్రయాణంలో ఆయన శాస్త్రీయ పరిశోధన, ప్రజా సంబంధాలు , భారతదేశం యొక్క గగన్‌యాన్ మిషన్ కోసం తయారీతో సహా అనేక కార్యకలాపాలలో పాల్గొన్నారు.

**శాస్త్రీయ పరిశోధన... ప్రయోగాలు**

శుభాన్షు, అతని సహచరులు ISS పై దాదాపు 60 ప్రయోగాలు నిర్వహించారు. వాటిలో 7 ప్రయోగాలు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ISRO) ప్రత్యేకంగా రూపొందించాయి. ఈ ప్రయోగాలు భారతదేశ భవిష్యత్ అంతరిక్ష కార్యకలాపాలకు, ముఖ్యంగా గగన్‌యాన్ , చంద్రుని మిషన్‌కు ముఖ్యమైనవి. ఈ ప్రయోగంలో, శుభాన్షు అంతరిక్షంలోని సూక్ష్మగురుత్వాకర్షణ శక్తిలో సంభవించే కండర ద్రవ్యరాశి నష్టాన్ని అధ్యయనం చేశాడు. గురుత్వాకర్షణ శక్తి లేనప్పుడు కండరాలు ఎలా బలహీనపడతాయో గమనించి, దానిని నివారించడానికి మార్గాలను కనుగొన్నాడు. ఇది భూమిపై ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల చికిత్సలో కూడా సహాయపడుతుంది. దీనిలో, శుభాన్షు తీవ్రమైన పరిస్థితులలో జీవించగల చిన్న సూక్ష్మ జంతువులను (టార్డిగ్రేడ్‌లు) అధ్యయనం చేశాడు. అవి అంతరిక్షంలో ఎలా కోలుకుంటాయో అతను చూశాడు. ఇది భవిష్యత్తులో దీర్ఘకాల మిషన్‌లకు (మార్స్ ప్రయాణం వంటివి) ఉపయోగపడుతుంది.

**విత్తనాలు మొలకెత్తడం**

శుభాంషు మెంతులు, మూంగ్ వంటి విత్తనాలను అంతరిక్షంలో మొలకెత్తించాడు. ఈ విత్తనాల జన్యుశాస్త్రం, సూక్ష్మజీవుల మార్పులు ... పోషక విలువలను ఆయన అధ్యయనం చేశాడు. ఈ ప్రయోగం అంతరిక్షంలో పంటలు పండించే అవకాశాన్ని అన్వేషిస్తుంది.

**సైనోబాక్టీరియా అధ్యయనం**

ఈ ప్రయోగంలో శుభాన్షు సైనోబాక్టీరియా (నీటి బ్యాక్టీరియా) పెరుగుదల, కార్యకలాపాలను అధ్యయనం చేశాడు. ఇవి భవిష్యత్తులో చంద్రుడు లేదా అంగారక గ్రహంపై జీవనాధార వ్యవస్థలకు ఆక్సిజన్ , ఇంధనాన్ని సృష్టించగలవు.

**మైక్రోఆల్గే ప్రయోగం**

శుభాన్షు మైక్రోఆల్గేలను పరీక్షించారు. ఇవి అంతరిక్షంలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనానికి మూలంగా ఉంటాయి. ఇది డీప్ స్పేస్ మిషన్లకు చాలా అవసరం.

**పంట విత్తనాల అధ్యయనం**

అంతరిక్షంలో అవి ఎలా పెరుగుతాయో చూడటానికి 6 రకాల పంట విత్తనాలను పరిశోధించాడు. తరువాత, జన్యు మార్పులను అర్థం చేసుకోవడానికి ఈ విత్తనాలను భూమిపై అనేక తరాల పాటు పెంచుతారు. మైక్రోగ్రావిటీలో కళ్ళు ,మెదడుపై ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి శుభాన్షు కంప్యూటర్ స్క్రీన్‌ల వాడకాన్ని అధ్యయనం చేశాడు. అంతరిక్షంలో డిజిటల్ వ్యవస్థలను బాగా ఉపయోగించడం కోసం ఇది ఉద్దేశించబడింది. వీటితో పాటు వారు ఎముకల ఆరోగ్యం, రేడియేషన్ ఎక్స్‌పోజర్ , మానసిక ఆరోగ్యంపై కూడా ప్రయోగాలు నిర్వహించారు. ఈ ప్రయోగాలు భూమిపై వ్యాధుల చికిత్సకు ,వ్యోమగాములను రక్షించడానికి ఉపయోగపడతాయి.

**ప్రజా సంబంధాలు , ప్రేరణ**

శుభాన్షు ప్రయోగాలు చేయడమే కాకుండా ప్రజలతో కూడా కనెక్ట్ అయ్యాడు. జూన్ 28న ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో వీడియో కాల్‌లో మాట్లాడారు. అంతరిక్ష సౌందర్యాన్ని ఆయన వివరించారు. జూలై 4 , 8 తేదీల్లో ఆయన పాఠశాల పిల్లలతో అమెచ్యూర్ రేడియోలో మాట్లాడారు, అందులో ఆయన అంతరిక్ష జీవితం గురించి మాట్లాడారు. అంతరిక్షం నుండి చూసినప్పుడు సరిహద్దులు ఉండవని, భూమి ఐక్యంగా కనిపిస్తుందని ఆయన అన్నారు. ఇవి కూడా చదవండి: ప్రతి సంవత్సరం రాజస్థాన్ ఎడారి వరదలు... భారతదేశ వాతావరణం మారిందా?

**గగన్‌యాన్‌కు సన్నాహాలు ప్రకటన**

శుభాన్షు చేసిన ఈ మిషన్ భారతదేశ గగన్‌యాన్ మిషన్ (2027లో ప్రారంభించబడుతుంది) కోసం శిక్షణ లాంటిది. అతను అంతరిక్షంలో జీవించడం, పనిచేయడం మరియు అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో అనుభవాన్ని పొందాడు, ఇది గగన్‌యాన్ బృందానికి ఉపయోగపడుతుంది.

**శుభాన్షు దినచర్య**

శుభాన్షు బిజీగా ఉండేవాడు. ఉదయం నుండి అతను ప్రయోగాలు చేసేవాడు, డేటాను రికార్డ్ చేసేవాడు మరియు బృందంతో కలిసి పనిచేసేవాడు. అతను మైక్రోగ్రావిటీలో వంట చేయడం, నిద్రపోవడం మరియు వ్యాయామం చేయడం కూడా నేర్చుకున్నాడు. అతని చిన్న బొమ్మ హంస "జాయ్" అతనితో ఉంది, ఇది సున్నాగురుత్వాకర్షణ సూచికగా పనిచేసింది. యాక్సియమ్4 మిషన్‌లో భాగంగా 18 రోజుల పాటు అంతరిక్షంలో గడిపిన శుక్లాతో పాటు మిగిలిన వ్యోమగాములకు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం క్వారంటైన్‌కు తరలించనున్నారు. అక్కడ వారం రోజుల పాటు నలుగురు శిక్షణ పొందిన అనంతరం బయటకు వస్తారు.



## ఆయుధాలు ఇస్తే.. నువ్వు మాస్కోపై దాడి చేస్తావా..?

**టీపీఎన్, అమెరికా :**

తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపేస్తానని చెప్పిన ట్రంప్..ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి సాధించలేరు. కాల్పుల విరమణపై ఒప్పించేందుకు పుతిన్ తో ఫోన్ లో మాట్లాడారు అమెరికా అధ్యక్షుడు. కానీ పుతిన్ నుంచి సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జెలెన్ స్కీకి ఫోన్ చేసి బంపర్ ఆఫర్ ఇచ్చారు. అమెరికా ఆయుధాలు ఇస్తే మీరు మాస్కోపై దాడి చేయగలరా? ... సెయింట్ పీటర్స్‌బర్గ్‌పై కూడా దాడి చేయగలరా?" అని ట్రంప్ అడిగినట్లు సమాచారం. దీనికి జెలెన్స్కీ, "ఖచ్చితంగా. మీరు మాకు ఆయుధాలు ఇస్తే, మేము చేయగలము" అని బదులిచ్చారు.'ట్రంప్ వారిని (రష్యన్లను) బాధపెట్టాలని కోరుకుంటున్నారు' మరియు రష్యాను చర్చల పట్టికలోకి రమ్మని బలవంతం చేయాలనుకుంటున్నారు అని వర్గాలు తెలిపాయి. అయితే, మాస్కోపై దాడి చేయడానికి ఉపయోగించే దీర్ఘశ్రేణి ఆయుధాలను అమెరికా ఉక్రెయిన్‌కు ఇస్తుందా లేదా అనేది ప్రస్తుతానికి స్పష్టంగా లేదు.



## ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరం సింగపూర్

**టీపీఎన్, సింగపూర్ :**

ప్రపంచంలోని అత్యంత ఖరీదైన నగరాల్లో సింగపూర్ వరుసగా మూడోసారి నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. జూలియస్ బేర్ అనే నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఇదివరకు రెండో స్థానంలో హాంకాంగ్ ఉండగా ఇప్పుడు దాన్ని పక్కకు నెట్టి లండన్ రెండో స్థానానికి చేరుకుంది. హాంకాంగ్ మూడో స్థానానికి చేరుకుంది. ఒక మిలియన్ డాలర్ల బ్యాంక్ బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు, వాళ్లు కొనుగోలు చేస్తున్న వస్తువులు, అనుభవిస్తున్న విలాసాల ఆధారంగా వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్ స్టైల్ ఇండెక్స్ విశ్లేషించి ఈ నివేదికను తయారు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి మార్చి మధ్య డేటా ఆధారంగా నివేదికను సిద్ధం చేయగా సింగపూర్‌ను అత్యంత ఖరీదైన నగరంగా గుర్తించింది.



## ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా యూలియా

**టీపీఎన్, ఉక్రెయిన్ :**

నూతన ప్రధానిగా యూలియా స్విరిడెంకో నామినేట్ అయ్యారు. యూలియాను తదుపరి ప్రధానమంత్రిగా అధ్యక్షుడు జెలెన్ స్కీ నామినేట్ చేశారు. పార్లమెంట్ ఆమోదం తరవాత ఉక్రెయిన్ రెండో మహిళా ప్రధానిగా యూలియా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉక్రెయిన్ మొదటి మహిళా ప్రధానిగా 2005 నుండి 2010 వరకు యూలియా టిమోషెంకో ఉన్నారు. ఇప్పుడు రెండో మహిళా ప్రధానిగా యూలియా స్విరిడెంకో కాబోతున్నారు. ఇక ప్రస్తుతం స్విరిడెంకో ఉక్రెయిన్ ప్రభుత్వంలో మొదటి డిప్యూటీ ప్రధాని, ఆర్థికమంత్రిగా పనిచేస్తున్నారు. యుద్ధం సమయంలో ఐరోపా, అమెరికాతో ఆర్థిక సహకారం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. పూర్తి స్థాయి యుద్ధాన్ని కొనసాగిస్తూ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరిచడంతో ఆమె ప్రశంసలు అందుకున్నారు.

# అమెరికా ఆంక్షలకు భయపడమన్న రష్యా

**టీపీఎన్, రష్యా :**

ఉక్రెయిన్ యుద్ధంపై కొత్త ఆంక్షలు విధించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ నిర్ణయాల వెనుక గల కారణం ఏమిటో మాస్కో అర్థం చేసుకోవాలనుకుంటోందని అన్నారు. ఎలాంటి ఆంక్షలనైనా ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నామని రష్యా ఘాటుగా సమాధానం ఇచ్చింది. రష్యాకు ట్రంప్ ఇచ్చిన 50 రోజుల కాల్పుల విరమణ అల్టిమేటంపై లావ్రోవ్ మాట్లాడుతూ, "అమెరికా అధ్యక్షుడిని ఏది ప్రేరేపిస్తుందో తాము అర్థం చేసుకోవాలనుకుంటున్నామని అన్నారు. మనం కొత్త ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందనడంలో నాకు ఎటువంటి సందేహం లేదన్నారు. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్దేశించిన గడువులోపు ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణకు రష్యా అంగీకరించకపోతే సెకండరీ టారిఫ్ విధిస్తామనే ట్రంప్ బెదిరింపును కూడా ఆయన లైట్‌గా తీసుకున్నారు. సోమవారం వైట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ మాస్కోకు తీవ్ర హెచ్చరిక చేసిన తర్వాత రష్యా నుండి ఈ ప్రకటన వచ్చింది. 50 రోజుల్లో ఒప్పందం కుదరకపోతే మేము ద్వితీయ సుంకాలను విధిస్తామని ట్రంప్ అన్నారు. గతంలో కాల్పుల విరమణ



చర్చలు జరిగినప్పటికీ రష్యా అధ్యక్షుడు క్షిపణి దాడులు కొనసాగించడంపై ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. . ఆయన చెప్పేది చేస్తారని, చాలా అందంగా మాట్లాడతారని, రాత్రిపూట ప్రజలపై బాంబులు వేస్తారని నేను అనుకున్నాను. నాకు అది ఇష్టం లేదు అని అన్నారు ట్రంప్. ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి పేట్రియాట్ క్షిపణి వ్యవస్థలు , బ్యాటరీలను నాటోకు పంపుతామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ఇది పూర్తి బ్యాటరీల సెట్. త్వరలో మరిన్ని వస్తాయని అమెరికా వర్గాలు చెబుతున్నాయి.

**ట్రంప్ అసంతృప్తి**

జనవరిలో వైట్ హౌస్ కు తిరిగి వచ్చినప్పటి నుంచి ట్రంప్ యుద్ధంలో రష్యా పాత్ర పట్ల పదేపదే అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గత వారం పుతిన్ చాలా మందిని చంపుతున్నందున నేను అతనితో సంతోషంగా లేను అని అన్నారు. NATO సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే అమెరికా అధ్యక్షుడి వైఖరిని సమర్థించారు.

# కేరళ నర్సు నిమిషా ప్రియ ఉరిశిక్ష వాయిదా

**టీపీఎన్, యెమెన్ :**

హమ్మయ్యా..కేరళ నర్సు నిమిషా ప్రియ ఉరిశిక్ష వాయిదా పడింది. భారత ప్రభుత్వం యెమన్ అధికారులతో జరిపిన చర్చల నేపథ్యంలో చివరి క్షణంలో ఆమె ఉరిశిక్షను తాత్కాలికంగా వాయిదా వేశారు. హత్యకు గురైన తలాల్ అబ్దుల్ మహదీ కుటుంబం.. గిరిజన నాయకులతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. నిమిషప్రియ విడుదల కోసం.. కంతాపురం ఎంపీ అబూబకర్ ముస్లియార్ జోక్యం చేసుకున్నందుకు యాక్షన్ కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. నిమిషప్రియను విడుదల చేయడానికి అనధికారిక చర్చలు ప్రారంభమయ్యాయి. గిరిజన నాయకులు, తలాల్ బంధువులు, లీగల్ కమిటీ సభ్యులు.. కుటుంబ సభ్యులు చర్చలలో పాల్గొన్నారు.

హత్య కేసులో నిమిషా ప్రియకు యెమెన్ కోర్టు మరణశిక్ష విధించింది. ఆమె 2017 నుంచి యెమెన్ జైలులో ఉంది. యెమెన్ పౌరుడు తలాల్ అబ్దో మహదీని హత్య చేసిన కేసులో నిమిషా దోషిగా తేలింది. తన పాస్‌పోర్ట్‌ను అతని దగ్గర నుంచి తీసుకోవడానికి మహదీకి అనస్థీషియా ఇచ్చినట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. కానీ ఈ ఇంజెక్షన్ల అధిక మోతాదు కారణంగా మహదీ మరణించాడు.

**అసలేం జరిగిందంటే..**

నిమిషా ప్రియ 2011లో ఉపాధి కోసం యెమెన్ వెళ్లారు. అంతర్యుద్ధం కారణంగా భారతదేశానికి తిరిగి వచ్చారు నిమిషా ప్రియ భర్త , కుమార్తె. తన కుటుంబాన్ని పోషించుకోవడానికి యెమెన్ లో ఉండిపోయారు నిమిషా. యెమెన్ చట్టం ప్రకారం విదేశీ వైద్య నిపుణులు అక్కడ క్లినిక్ తెరవాలనుకుంటే యెమెన్ జాతీయుడితో భాగస్వామ్యం కుదుర్చుకోవాలి . దీంతో తలాల్ అబ్దో మహదీతో వ్యాపారం ప్రారంభించిన నిమిషా ప్రియ. తనను పెళ్లి చేసుకున్నట్టు తప్పుడు పత్రాలను సృష్టించి , పాస్‌పోర్ట్‌ను నిలిపివేసాడని, ఆమెను సంవత్సరాల తరబడి శారీరకంగా వేధించాడని, ఆర్థిక దోపిడీకి, పదే పదే బెదిరింపులకు గురిచేశాడని ఆరోపించారు. నిమిషా ప్రియ . 2017లో తన పాస్‌పోర్ట్‌ను లాక్కొని యెమెన్‌ను విడిచి వెళ్లాలనే లక్ష్యంతో మహదిని మత్తులో పడేయడానికి ప్రయత్నించింది నిమిషా. కానీ మత్తు మోతాదు



మించి చనిపోయాడు మహదీ. తలాల్ అబ్దో మహదీ శరీరాన్ని ముక్కలు చేసి పారవేసినట్టు నిమిషా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కేరళలోని పాలక్కాడ్ నివాసి అయిన నర్స్ నిమిషా గత దశాబ్ద కాలంగా తన భర్త , కుమార్తెతో కలిసి యెమెన్‌లో పనిచేస్తోంది. 2016లో, యెమెన్‌లో అంతర్యుద్ధం కారణంగా, దేశం వెలుపల ప్రయాణం పరిమితం చేయబడింది. కానీ అంతకు ముందు 2014లో, ఆమె భర్త , కుమార్తె భారతదేశానికి తిరిగి వచ్చారు. కానీ నిమిషా తిరిగి రాలేకపోయింది. దీని తరువాత 2017 జులైలో యెమెన్ పౌరుడిని హత్య చేసినట్లు నిమిషాపై ఆరోపణలు వచ్చాయి. 2018 మార్చి 7న యెమెన్‌లోని కోర్టు నిమిషాకు మరణశిక్షను ఖరారు చేసింది.

**నిమిషాకు ఏ చట్టం కింద శిక్ష విధించబడింది?**

యెమెన్‌లో షరియా చట్టం వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం హత్య కేసులో మరణశిక్ష విధించబడుతుంది. బ్లడ్ మనీ అనేది హత్యకు పాల్పడిన వ్యక్తికి క్షమాపణ చెప్పే పద్ధతి. అతను మరణించిన వ్యక్తి కుటుంబానికి పరిహారంగా పెద్ద మొత్తంలో డబ్బు చెల్లిస్తే. ఈ మొత్తాన్ని మృతుడి కుటుంబంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం నిర్ణయించబడుతుంది.

యెమెన్‌లో నిమిషాకు మరణశిక్ష విధించినప్పటి నుంచి బ్లడ్ మనీ చెల్లించి ఆమెను విడుదల చేయాలనే చర్చ జరిగింది. ఈ పద్ధతి క్షమాపణకు అవకాశాన్ని కల్పించడమే కాకుండా, బాధితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం ద్వారా కొంత న్యాయం కూడా లభిస్తుందని ఇస్లాం నిపుణులు విశ్వసిస్తున్నారు.

# కొనుగోళ్ల కళకళ.. మార్కెట్లు రీబౌండ్!

**టీపీఎన్, ముంబై :**

నాలుగు సెషన్ల వరుస నష్టాలకు తెరపడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం దుమ్మురేపాయి. బ్రాడర్ సహా బెంచ్‌మార్క్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. డాలర్ విలువ తగ్గడం, రూపాయి బలపడటం, వడ్డీరేట్ల కోతకు అవకాశం ఉందంటూ ఆర్బీఐ గవర్నర్ మల్హోత్ర సంకేతాలు ఇవ్వడం, వివిధ రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడమే ఇందుకు కారణం. నిజానికి మార్కెట్లు ఫ్లాటుగా మొదలయ్యాయి. క్రమంగా కొనుగోలు ఆసక్తి పెరగడంతో సూచీలు గరిష్ఠాలకు చేరుకున్నాయి. మొత్తానికి నిఫ్టీ 113, సెన్సెక్స్ 317 పాయింట్ల మేర ఎగిశాయి. నిఫ్టీ 25,200 స్థాయి వద్ద ముగియడం గమనార్హం.



క్రితం సెషన్లో 82,253 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ మంగళవారం 82,233 వద్ద మొదలైంది. 82,221 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 82,743 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 317 పాయింట్ల లాభంతో 82,570 వద్ద ముగిసింది. 25,089 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,088 వద్ద కనిష్ఠ, 25,245 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 113 పాయింట్ల లాభంతో 25,195 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 241 పాయింట్లు పెరిగి 57,006 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ50లో 35 కంపెనీలు లాభపడగా 15 నష్టపోయాయి. హీరోమోటో, బజాజ్ ఆటో, సన్ ఫార్మా, శ్రీరామ్ ఫైనాన్స్, అపోలో హాస్పిటల్స్ టాప్ గెయినర్స్. హెచ్‌సీఎల్ టెక్, ఎటర్నల్, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఎక్కువ నష్టపోయాయి. నేడు ఆటో, హెల్త్‌కేర్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంకు, రియాల్టి, కన్జంప్షన్, ఎఫ్ఎంసీజీ, మీడియా, చమురు, ఫైనాన్స్, బ్యాంకింగ్ సూచీలు కళకళలాడాయి. మిగిలినవి మోస్తరుగా పెరిగాయి.

నేడు ఎన్ఎస్ఈలో మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లకు అనుకూలంగా మారింది. మొత్తం 3015 షేర్లు ట్రేడవ్వగా 1969 లాభపడ్డాయి. 961 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 85 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 21 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 96, లోయర్ సర్క్యూటును 47 షేర్లు చేరాయి.

డాలరుతో పోలిస్తే రూపాయి 18 పైసలు బలపడి 85.81 వద్ద స్థిరపడింది. వారీ రెన్యూవబుల్స్ షేర్లు నేడు 17 శాతం మేర ఎగిశాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నికర వడ్డీ ఆదాయం 17.6% పెరిగి రూ.3292 కోట్లుగా ఉంది. నికర లాభం 23% వృద్ధిరేటుతో 1593 కోట్లుగా ఉంది. ఈక్విటీ లేదా రైట్స్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించాలని ఐనాక్స్ యోచిస్తోంది. జూన్‌లో వస్తువుల వాణిజ్య లోటు 18.78 బిలియన్ డాలర్లకు తగ్గింది. రెండో రోజు మధ్యాహ్నానికి యాంథెమ్ బయో సైన్స్ ఐపీవోకు 2.67 రెట్ల స్పందన లభించింది. విదేశాల్లో షిప్పింగ్, లాజిస్టిక్స్ అవకాశాల కోసం రాయిస్ హసన్ సాడి గ్రూపుతో కాంకర్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హిమాద్రి స్పెషాలిటీ క్యూ1 నికర లాభం 48.2 శాతం వృద్ధితో రూ.122 కోట్ల నుంచి రూ. 181కోట్లకు పెరిగింది. పవర్‌మెక్ ప్రాజెక్ట్స్‌కు రూ.551 కోట్ల విలువైన ఆర్డర్ లభించింది. ఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ కోసం పెట్రోనెట్ ఎల్ఎన్‌జీతో దీపక్ ఫర్టిలైజర్స్ ఒప్పందం కుదుర్చుకుంది.

మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709



# మళ్లీ పరుగులు పెడుతున్న పసిడి!

**టీపీఎన్, ముంబై :**

బంగారం ధర మళ్లీ పెరుగుతోంది. గత వారంలో 98 వేలకు దగ్గర్లో ఉన్న పది గ్రాముల బంగారం ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అయింది. పది గ్రాముల బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలను దాటి ట్రేడ్ అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 890కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 91, 560కి చేరింది. సోమవారంతో పోల్చుకుంటే దాదాపు రెండొందలు పెరిగింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1,00,040కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 710కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 890కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 91, 560కి చేరింది. వెండి ధరలు సోమవారంతో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి.

# భారత్‌లో అడుగుపెట్టిన టెస్లా.. ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం



**టీపీఎన్, ముంబై :**

భారతదేశంలోని ఎలక్ట్రిక్ వాహన అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోజుని టెస్లా కోల్పోలేదు. టెస్లా కంపెనీ దేశంలో తన తొలి షోరూమ్‌ను ముంబై నగరంలో అధికారికంగా ప్రారంభించింది. ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (BKC)లోని మేకర్ మ్యాక్సిటీ మాల్ లో స్థాపించబడిన ఈ షోరూమ్ ప్రారంభ వేడుకకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హాజరై టెస్లా ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ షోరూమ్‌ను "టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్"గా పిలుస్తారు. సుమారు 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడిన ఈ కేంద్రంలో, టెస్లా మోడల్ Y మరియు మోడల్ 3 వాహనాలను ప్రదర్శనకే కాకుండా అమ్మకానికీ ఉంచారు. ఇందులో మోడల్ Y భారతదేశంలో విక్రయించబడుతున్న తొలి అధికారిక టెస్లా వాహనంగా నిలిచింది. దీని ధర సుమారు రూ. 60 లక్షల నుండి (ఎక్స్‌షోరూమ్) ప్రారంభమవుతోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఫడ్నవీస్ మాట్లాడుతూ, టెస్లా భారతదేశంలో తన రిటైల్ కార్యకలాపాలను ప్రారంభించడాన్ని హర్షంతో స్వాగతిస్తున్నామని తెలిపారు. ముంబై కేవలం ఆర్థిక మరియు వినోద రాజధానిగా మాత్రమే కాక, ఆవిష్కరణలు మరియు పర్యావరణ సుస్థిరత కోసం కూడానూ ఒక ప్రధాన కేంద్రంగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. టెస్లా మహారాష్ట్రలో తన R&D కేంద్రాలు, అలాగే తయారీ యూనిట్లు నెలకొల్పాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం టెస్లా, చైనాలోని షాంఘై గిగాఫ్యాక్టరీలో ఉత్పత్తి చేసిన మోడల్ Y వాహనాలను భారతదేశానికి దిగుమతి చేస్తోంది. ముంబై షోరూమ్ ప్రారంభంతో, దేశీయ ఎలక్ట్రిక్ వాహన రంగంలో టెస్లా ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించినట్లు భావించవచ్చు.




# భారత మార్కెట్లో కియా కొత్త ఎలక్ట్రిక్ కారు!

**టీపీఎన్, ముంబై :**

భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ కార్ల రాకడ పెరుగుతోంది. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా, అధిక మైలేజ్ అందించే కార్లను కంపెనీలు విడుదల చేస్తున్నాయి. అంతేకాకుండా, సామాన్యులు కూడా కొనుగోలు చేయగలిగేలా ధరలను సరసమైన స్థాయిలో నిర్ణయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కియా (Kia) సంస్థ నుంచి మరో కొత్త ఎలక్ట్రిక్ కారు లాంచ్ అయింది. కియా క్యారెన్స్ క్లావిస్ ఈవీ (Kia Carens Clavis EV) పేరుతో ఈ కొత్త ఎలక్ట్రిక్ వాహనాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చింది.

ఈ ఎలక్ట్రిక్ కారులో రెండు రకాల బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. పెద్ద బ్యాటరీ ప్యాక్ వేరియంట్‌లో, ఒక్కసారి పూర్తి ఛార్జింగ్‌తో 490 కిలోమీటర్ల మైలేజ్ లభిస్తుందని కంపెనీ ప్రకటించింది. అయితే, చిన్న బ్యాటరీ ప్యాక్ వేరియంట్ సింగిల్ ఛార్జ్‌తో దాదాపు 404 కిలోమీటర్ల మైలేజ్ అందిస్తుందని తెలిపింది. కియా క్యారెన్స్ క్లావిస్ ఈవీ ధర 17.99 లక్షల రూపాయల నుంచి ప్రారంభమవుతుంది మరియు 24.49 లక్షల రూపాయల వరకు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. ఈ ధరలు ఎక్స్ షోరూం ఆధారంగా నిర్ణయించబడ్డాయి. ప్రాంతాన్ని బట్టి ధరలు కొంత మారవచ్చు. ఈ కొత్త మోడల్ కియా క్యారెన్స్ క్లావిస్ ఈవీ కారు ఆధునిక ఫీచర్లతో రూపొందించబడింది. ఇందులో ఎల్ఈడి కనెక్టెడ్ DRLలు, ఐస్ క్యూబ్ ఎల్ఈడి హెడ్‌లాంప్స్, మరియు 17 అంగుళాల క్రిస్టల్ కట్ డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్ వంటి ఆకర్షణీయమైన ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి.



# న్యూట్రల్ అంటే వడ్డీరేట్ల కోత ఉండబోదని కాదు: ఆర్బీఐ గవర్నర్

**టీపీఎన్, ముంబై :**

న్యూట్రల్ ద్రవ్య విధాన వైఖరి అంటే వడ్డీ రేట్ల తగ్గింపు ఉండకపోవడం కాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఆర్థిక వ్యవస్థలో సమతుల్యతను కాపాడటంతో పాటు, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించే దిశగా ఆర్బీఐ తన విధానాలను సర్దుబాటు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ వ్యాఖ్యలు ఆర్థిక వర్గాలు, ముఖ్యంగా మార్కెట్ వర్గాల్లో విస్తృత చర్చను రేకెత్తించాయి.

'న్యూట్రల్ వైఖరి అంటే మేము ఆర్థిక పరిస్థితులను బట్టి వడ్డీ రేట్లను పెంచొచ్చు. లేదా తగ్గించొచ్చు. ఇది ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, గ్లోబల్ ఎకనామిక్ ట్రెండ్స్ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది' అని మల్హోత్రా వివరించారు. ప్రస్తుతం రెపో రేటు 6.5% వద్ద ఉంది. కొన్ని ద్రవ్య విధాన సమీక్షల నుంచి మార్పు లేకుండా కొనసాగుతోంది. అయితే ద్రవ్యోల్బణం ఆర్బీఐ లక్షిత 4 శాతానికి దిగువనే ఉంటున్న నేపథ్యంలో రేట్ల తగ్గింపు అవకాశాలపై చర్చ ఊపందుకుంది. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్నప్పటికీ ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు అవసరమైతే ఆర్బీఐ రేట్ల తగ్గింపును పరిశీలిస్తుందని మల్హోత్ర సూచించారు. 'మేము డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటాం. హడావుడిగా లేదా అనవసర ఊహాగానాలతో నిర్ణయాలు తీసుకోము' అని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, దిగుమతి ఖర్చులు, ఇంధన ధరలు వంటి అంశాలు కూడా ఆర్బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతాయని ఆయన పేర్కొన్నారు.

తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఆర్థిక విశ్లేషకులు ఆర్బీఐ తదుపరి ద్రవ్య విధాన సమావేశంపై దృష్టి సారించారు. గతంలో RBI ద్రవ్యోల్బణ నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ ప్రస్తుతం ఆర్థిక వృద్ధిని పెంపొందించే దిశగా అడుగులు వేసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి గణాంకాల ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తున్నప్పటికీ, వినియోగ డిమాండ్‌ను మరింత పెంచేందుకు వడ్డీ రేట్ల తగ్గింపు దోహదపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.




# తగ్గిన పన్ను రాబడి.. అయినా బేఫికర్!

**టీపీఎన్, ముంబై :**

సెప్టెంబర్లో పన్ను వసూళ్లు మెరుగ్గా ఉంటాయని ఆదాయపన్ను వర్గాలు అంచనా వేస్తున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి జులై 10 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 1.34% తగ్గి రూ. 5.63 లక్షల కోట్లుగా ఉన్నాయని సీబీడీటీ వెల్లడించింది. ఈ తగ్గుదలకు ప్రధాన కారణం కార్పొరేట్ పన్ను వసూళ్లలో 3.81% క్షీణత, రిఫండ్‌లలో గణనీయమైన పెరుగుదలేనని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఏదేమైనా ఈ తగ్గుదల ఆందోళనకరం కాదని సెప్టెంబర్ నాటికి పన్ను వసూళ్లు 56% పెరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 3.17% పెరిగి రూ. 6.65 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ. 6.44 లక్షల కోట్లుగా ఉంది. రిఫండ్‌లు 38% పెరిగి రూ.1.02 లక్షల కోట్లకు చేరడంతో నికర వసూళ్లు తగ్గాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ. 2.07 లక్షల కోట్ల నుంచి రూ.1.99 లక్షల కోట్లకు తగ్గగా వ్యక్తిగత పన్ను వసూళ్లు (వ్యక్తులు, HUFలు, సంస్థలు) రూ. 3.45 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

ప్రభుత్వ వర్గాల ప్రకారం డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తృత అమలు వల్ల రిఫండ్ ప్రాసెసింగ్ సమయం 93 రోజుల నుంచి 17 రోజులకు తగ్గింది. దీనివల్ల రిఫండ్‌లు గణనీయంగా పెరిగాయి. 201314లో 11.5% ఉన్న రిఫండ్‌ల శాతం 202425 నాటిలో 17.6%కి పెరిగింది. 2013లో 3.8 కోట్లుగా ఉన్న ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు 202425లో 8.89 కోట్లకు 133% పెరగడం గమనార్హం.

పన్ను వసూళ్లలో తాత్కాలిక తగ్గుదల ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థ 6.36.8% వృద్ధి రేటుతో స్థిరంగా ఉందని, నామినల్ గ్రోత్ 10.1%గా ఉంటుందని అంచనా. రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 2.1 శాతానికి తగ్గి ఆరేళ్ల కనిష్ఠానికి చేరడం, ఆహార ధరలు తగ్గడం వంటివి ఆర్థిక స్థిరత్వానికి సానుకూల సంకేతాలుగా ఉన్నాయి.

సెప్టెంబర్ నాటికి పన్ను వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం ధీమాగా ఉంది. ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోవడం, మధ్య తరగతికి అందించిన పన్ను రాయితీలు, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (STT)లో 7.5% వృద్ధి (రూ.17,874 కోట్లు) వంటివి ఊతమిస్తాయని భావిస్తోంది. పన్ను సేవలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించే చర్యలు తీసుకుంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు బాంబు బెదిరింపు!

**టీపీఎన్, ముంబై :**

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని ప్రముఖ పాఠశాలలు, విమానాశ్రయాలు మరియు ఇతర సంస్థలకు బాంబు బెదిరింపు ఈమెయిల్స్ రావడం పెరిగింది. ఈ బెదిరింపులపై అధికారులు ఇప్పటికే విచారణ జరుపుతున్నారు. తాజాగా, ముంబైలోని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (BSE) భవనానికి మరోసారి బాంబు బెదిరింపు ఈమెయిల్ రావడం తీవ్ర కలకలం సృష్టించింది.

మంగళవారం, BSE భవనంలో బాంబు అమర్చినట్లు సూచిస్తూ కామ్రేడ్ పినరయి విజయన్ పేరుతో ఒక ఈమెయిల్ అధికారులకు అందింది. ఈ ఈమెయిల్‌లో భవనంలో నాలుగు ఆర్డీఎక్స్ ఐఈడీ బాంబులు అమర్చినట్లు, మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పేలుళ్లు సంభవిస్తాయని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సమాచారంతో అధికారులు వెంటనే అప్రమత్తమై, బాంబు స్క్వాడ్ బృందాలు మరియు భద్రతా బలగాలు ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టాయి. గాలింపులో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని, ఈ బెదిరింపు నకిలీదై ఉండవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ ఈమెయిల్ పంపిన గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





# మోస్ట్ పవర్ ఫుల్ ఉమెన్ 2025.. ఎవరంటే?

ఆకాశమంతా నాదే.. అంటూ విహరించాలనేది ప్రతి ఒక్కరి కల. మరి అలాంటి ఆలోచనలు ఉన్నవారిని పంజరంలో బంధిస్తే.. అంతకుమించి నరకం మరోకటి ఉండదేమో కదూ. స్మిను జిందాల్.. పదకొండు సంవత్సరాల వయసులో యాక్సిడెంట్‌కు గురైంది. అలా అని వీల్‌చైర్‌కే పరిమితం కాలేదు. ఎన్నో సమస్యల్ని దాటుకుని.. పారిశ్రామిక వేత్తగా ఎదిగింది. ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ 2025 లిస్ట్ లో ఘనంగా చోటు సాధించుకుంది. ఢిల్లీలో ఎలిమెంటరీ స్కూల్ చదువు పూర్తయిన తరువాత జైపూర్‌లోని ప్రతిష్ఠాత్మకమైన మహారాణి గాయత్రీ దేవి స్కూల్‌లో చేరిన స్మిను కారు యాక్సిడెంట్ లో ప్రాణా పాయం నుంచి బయటపడింది. చదువు, ఆటలు, పాటలతో ఎప్పుడూ చురుగ్గా ఉండే అమ్మాయికి కొన్ని నెలల పాటు వీల్‌చైర్‌కే పరిమితం కావడం సంకెళ్లతో బంధించినట్లుగా అనిపించింది. స్మినుకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. కథక్ నృత్యంలో మంచి పేరు తెచ్చుకుంది. ఇక నేను డ్యాన్స్ చేయలేనా? అనే బాధ ఉండేది. అయితే తల్లిదండ్రులు మాత్రం నీకేం జరగలేదు. అన్నీ సర్దుకుంటాయి అంటూ ఏ లోటూ లేకుండా చూసుకున్నారు. స్మినులో ఆత్మవిశ్వాసం పెంచేలా ఎంతోమంది వ్యక్తుల నిజజీవిత గాథలు చెబుతుండేది తల్లి ఆర్తి. బిడ్డను నార్మల్ స్కూల్‌కే పంపించేది. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. అమ్మానాన్నలు నన్ను చాలా బాగా చూసుకునేవారు. అలా అని అతి గారాబం చేసేవారు కాదు అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది స్మిను. కొంతకాలం తరువాత తల్లిదండ్రులు స్మిను కోసం ఒక మెషిన్ తీసుకు వచ్చారు. ఆ మెషిన్ సహాయంతో రోజుకు కొన్ని గంటలు నిలబడేది. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజి ఆఫ్ కామర్స్‌లో డిగ్రీ చేసిన స్మిను జిందాల్ సా లిమిటెడ్ లో మేనేజ్‌మెంట్ ట్రైనీ స్థాయి నుంచి మేనేజింగ్ డైరెక్టర్ స్థాయికి చేరింది. స్మిను జిందాల్ పేరు పక్కన ప్రముఖ పారిశ్రామికవేత్త అనే గౌరవం రావడానికి ఎంతోకాలం పట్టలేదు. దివ్యాంగులకు దిశానిర్దేశం, సహాయపడడం లక్ష్యంగా స్వయం అనే సంస్థను ప్రారంభించింది. ప్రభుత్వసంస్థలు, విద్యాసంస్థలు, రవాణా సంస్థలతో కలిసి పని చేస్తోంది స్వయం. దివ్యాంగులకు ఉపయోగపడే ప్రభుత్వ పథకాలు ఎన్నో ఉన్నప్పటికీ వాటి గురించి చాలామందికి తెలియదు. స్వయం పోర్టల్ ద్వారా దివ్యాంగులకు ఉపయోగడే ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తున్నాం. టూరిజం, స్పోర్ట్స్, శానిటేషన్.. మొదలైన రంగాలలో ఇప్పుడు స్వయం పనిచేస్తోంది అంటుంది స్మిను. దివ్యాంగులకు మాత్రమే కాదు వృద్ధులు, గర్భిణులు.. మొదలైనవారికి స్వయం సహాయపడుతోంది. విమానాశ్రయాలు, హోటల్స్, స్టేడియంలాంటి ఎన్నో బహిరంగ ప్రదేశాలలో దివ్యాంగులకు కనీస సదు పాయాలు లేవు అంటున్న స్మిను జిందాల్ యాక్సెసబిలిటీ చాంపియన్ గా పేరు తెచ్చుకుంది. క్షణం తీరిక లేని వృత్తి జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని ఎలా సమన్వయం చేసుకుంటారు? అనే ప్రశ్నకు జిందాల్ ఇచ్చిన సమాధానంగా.. పని ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. అయితే పనే పాషన్‌గా మారినప్పుడు అలసటగా అనిపించదు. నన్ను అర్థం చేసుకునే కుటుంబం దొరకడం నా అదృష్టం. సరైయెన ప్రణాళిక ఉంటే వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కష్టమేమీ కాదు అని స్మిను జిందాల్ అంటోంది. ఈ క్రమంలో ఒకటి రెండు అని కాదు... ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. యాక్సిడెంట్ తరువాత లైఫ్ స్టైల్ ను నార్మల్ చేసుకోవడం దగ్గర్నుండి పురుషాధిపత్య రంగాలుగా భావించే స్టీల్, ఆయిల్, గ్యాస్ సెక్టార్‌లలో విజయం సాధించడం వరకు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాను. ఒక విధంగా చెప్పాలంటే నన్ను ప్రోత్సహించిన వారే కాదు నిరాశ పరిచిన వారు కూడా నేను ఈరోజు ఈ స్థాయిలో ఉండడానికి తోడ్పడ్డారు అని స్మిను జిందాల్ గర్వంగా చెబుతుంది. ఆశయాన్ని సాధించాలనే తపన, పట్టుదల ఉండాలే కానీ మిగతావన్నీ కారణాలే అంటూ స్మిను జీవితం మనకు స్ఫూర్తినిస్తుంది.

# బడ్జెట్ లో కొత్తఫోన్ లాంచ్ చేసిన రియల్ మీ




రియల్ మీ బడ్జెట్ సిరీస్ నుంచి కావెల్మ్ 8 వేల బడ్జెట్ ధరలో కొత్త స్మార్ట్ ఫోన్ లాంచ్ చేసింది. అదే, రియల్ మీ సి 71 స్మార్ట్ ఫోన్ మరియు ఈ స్మార్ట్ ఫోన్ ను స్లీక్ డిజైన్ మరియు బిగ్ బ్యాటరీ తో అందిస్తుంది. ఈ స్మార్ట్ ఫోన్ బడ్జెట్ ధరలో రివర్స్ ఛార్జ్ సపోర్ట్ తో రావడం మరో స్పెషాలిటీ. రియల్ మీ సరి కొత్తగా రిలీజ్ చేసిన ఈ బడ్జెట్ స్మార్ట్ ఫోన్ కాస్ట్ అండ్ ఫీచర్స్ చూసేద్దాం. రియల్ మీ సి 71 5జి స్మార్ట్ ఫోన్ ను రెండు వేరియంట్స్ లో లాంచ్ చేసింది. ఈ ఫోన్ బేసిక్ వేరియంట్ 4 జీబీ + 64 జీబీ ను రూ. 7,699 ధరతో అండ్ హై ఎండ్ వేరియంట్ 6 జీబీ +128 జీబీ ను రూ. 8,699 ధరతో అందించింది. ఈ ఫోన్ ను సేల్ కి అందుబాటులోకి తీసుకు వచ్చింది. అయితే, ఈ ఫోన్ ఫస్ట్ ఫస్ట్ జులై 17 వ తేదీ అర్ధరాత్రి 11 గంటల 59 నిమిషాలకు ముగుస్తుంది. ఈ ఫోన్ సి బ్లూ అండ్ ఒడిసియన్ బ్లాక్ రెండు కలర్స్ లో అవైలబుల్ గా ఉంది. ఈ ఫోన్ రియల్ మీ ఫోన్ రిలేటెడ్ హై ఎండ్ వేరియంట్ ను మెయిన్ బ్యాంక్ కార్డ్ తో తీసుకునే వారికి రూ. 700 బ్యాంక్ డిస్కౌంట్ ఆఫర్ అందించింది. ఈ ఆఫర్ తో ఈ ఫోన్ కేవలం రూ. 7,999 రూపాయల ధరతో లభిస్తుంది. రియల్ మీ సి 71 స్మార్ట్ ఫోన్ HD రిజల్యూషన్ మరియు 90Hz రిఫ్రెష్ రేట్ కలిగిన 6.74 ఇంచ్ డిస్ప్లేతో లాంచ్ అయ్యింది. ఈ ఫోన్ ను కేవలం 7.9mm మందంతో చాలా స్లీక్ డిజైన్ తో అందించింది. ఈ ఫోన్ ను 2 లక్షల 80 వేల AnTuTu స్కోర్ కలిగిన 12nm ఆక్టా కోర్ చిప్ సెట్ తో అందించింది అంతే కాకుండా ఇది 4G స్మార్ట్ ఫోన్ గా వచ్చింది. ఈ ఫోన్ లో 6 జీబీ ర్యామ్ అండ్ 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ అందించింది. ఈ ఫోన్ గరిష్టంగా 18 జీబీ డైనమిక్ ర్యామ్ కూడా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ లో డ్యూయల్ రియర్ కెమెరా అండ్ ముందు వాటర్ డ్రాప్ నోచ్ లో సెల్ఫీ కెమెరా అందించింది. ఈ ఫోన్ AI కెమెరా ఫీచర్స్ మరియు AI సర్కిల్ సెర్చ్ వంటి ఫీచర్స్ కూడా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ 15 W ఫాస్ట్ ఛార్జ్ మరియు 5W రివర్స్ ఛార్జ్ సపోర్ట్ కలిగిన 6300mAh బిగ్ బ్యాటరీతో అందించింది. సో ఫినిషింగ్ కూడా అన్నిరకాల సూటబుల్ గా ఉంటుంది.



# వారి కోసం స్పెషల్ మూన్ రైస్

ఏ గ్రహంపైనైనా అత్యంత ప్రతికూల పరిస్థితులను తట్టుకొని మరీ పెరిగే అద్భుతమైన సూపర్ డ్వార్ఫ్ రెడీ అయ్యింది. ఇది స్పేస్ లో గాని, చంద్రుడు, మార్స్ మీద గానీ.. అంతేకాకుండా భూమిపైన వాతావరణంలోనూ.. ఎడారుల్లో, ఇంట్లో కూడా ఇక వరి ధాన్యం పండించుకోవచ్చు. ఇటలీ అంతరిక్ష సంస్థ, మరో మూడు ఇటాలియన్ యూనివర్సిటీలతో కలిసి ఈ అద్భుత వరి వంగడాన్ని రూపొందించింది. చంద్రుడిపై మనుషుల దీర్ఘకాల మనుగడకు అవసరమైన వంగడాన్ని రూపొందించాలన్న లక్ష్యంతో మూన్ రైస్ పేరుతో చేపట్టిన పరిశోధనా ప్రాజెక్టు విజయవంతమైంది. 2 నుండి 3 అడుగులు ఎత్తు పెరిగే డ్వార్ఫ్ వరి వంగడాలు మాత్రమే మనకు తెలుసు. అయితే, ఈ సరి కొత్త రకం కేవలం 4 అంగుళాల అంటే 10 సెంటీమీటర్లు ఎత్తు మాత్రమే పెరుగుతుంది. అదీకాకుండా, అధిక మాంసకృత్తులు గల ధాన్యాన్ని దిగుబడినిస్తుందట. అంతరిక్ష యాత్రల్లో పాల్గొనే వ్యోమగాములు ముందుగా వండి ప్యాక్ చేసిన ఆహారంపైనే ప్రస్తుతం ఆధారపడుతున్నారు. తాజా పదార్థాలు వారి ఆహారంలో ఉండే అవకాశం లేదు. సుదీర్ఘ కాలం అంతరిక్ష యాత్రలో గడిపే వ్యోమగాముల శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలు అందటం లేదు. భూగోళానికి మరింత ఎక్కువ దూరంలో రోదసీలో పరిశోధనలు చేపట్టా లంటే విటమిన్లు, పీచుపదార్థం అధికంగా ఉండే ఆహారాన్ని అక్కడే పండించాలి. మూన్ రైస్ పరిశోధనా ప్రాజెక్టు ఈ లక్ష్యంతోనే ప్రారంభమైంది. ఐఎస్‌ఏ మొక్కల జీవశాస్త్రవేత్త మార్తా డెల్ బియాంకో ఈ పరిశోధన వివరాలను ప్రకటించారు. ఈ మూన్ రైస్ ప్రాజెక్టు పరిశోధనలు అంతరిక్ష సేద్యానికి పనికొచ్చే విషయాలకు మించిన ప్రయోజనాలను అందిస్తోంది. ఇది భూమిపై ఉండే రైతులకు కూడా ఉపయోగపడుతుంది. అత్యంత సమస్యాత్మక అంతరిక్షంలో పెరగటానికి రూపొందుతున్న ఈ అతి మరుగుజ్జు వంగడం ఆర్కిటిక్, అంటార్కిటిక్ ధ్రువాలకు దగ్గరి ప్రాంతాల్లో లేదా ఎడారుల్లో లేదా తక్కువ స్థలం ఉండే ఇళ్లలో కూడా కంట్రోల్డ్ వాతావరణంలో సాగుకు కూడా ఉపయోగపడుతుంది అని సైంటిస్ట్ తెలిపారు. వరి మొక్కలు అంతరిక్షంలో సూక్ష్మ గురుత్వాకర్షణకు ఎలా స్పందిస్తాయనే అంశంపై కూడా శాస్త్రవేత్తల టీమ్ పరిశోధనలు చేస్తుంది. అంతేకాకుండా వరి జన్యుశాస్త్రంలో పట్టున్న మిలన్ యూనివర్సిటీ, పంట శరీర ధర్మశాస్త్రంలో ప్రత్యేక కృషిచేస్తున్న రోమ్ యూనివర్సిటీ, అంతరిక్ష పంటలపై పరిశోధనలో ఆరితేరిన నేపుల్స్ యూనివర్సిటీ పరిశోధకులతో కలసి ఇటలీ అంతరిక్ష సంస్థ పరిశోధనలు చేస్తోంది. నాలుగేళ్ల 9 నెలల క్రితం ప్రారంభించిన పరిశోధనల్లో చాలా పురోగతి ఉంది. మిలన్ విశ్వవిద్యాలయంలో కేవలం 10 సెంటీమీటర్ల ఎత్తు పెరిగే ఉత్పరివర్తన చెందిన వరి రకాలపై పరిశోధనలు కొలిక్కివచ్చాయి. పంట ఎదుగుదల, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి మొక్కల నిర్మాణాన్ని మార్చగల జన్యువులను రోమ్ విశ్వవిద్యాలయం గుర్తించి మార్పులు చేసింది. ప్రైమరీ రిజల్ట్ చాలా పాజిటివ్ గా ఉన్నాయి. అంతరిక్షంలో మాంసాన్ని పెంచలేం. అందుకని ప్రొటీన్ అధికంగా ఉండేలా ఈ వంగడాన్ని అభివృద్ధి చేస్తున్నాం అన్నారు సైంటిస్టులు. ఇక తాజా ఆహారం శరీర పోషణకు మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. అంతరిక్షానికి తీసుకెళ్లిన ముందే వండిన ఆహారం కొంత కాలం బాగానే ఉంటుంది. దీర్ఘకాలం దానిపై ఆధారపడటం సాధ్యం కాదు. అందువల్ల అక్కడే వ్యోమగాముల కళ్ల ముందు పెరిగే పంట వంగడాలను రూపొందించటం ద్వారా వారికి తాజా ఆహారంతో పాటు ఒత్తిడిని తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని కూడా అందించాల్సి ఉంటుంది అని అన్నారు.



# వైరల్.. శివాలయానికి క్యూ కట్టిన ముస్లిం భక్తులు!

శివాలయానికి సాధారణంగా శివభక్తులు, హిందువులు వెళ్తుంటారు. కానీ ఒక ప్రత్యేకమైన శివాలయానికి మాత్రం హిందువులతో పాటుగా ముస్లిం భక్తులు కూడా ఎంతో భక్తితో వెళ్తారు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఈ దృశ్యాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. అందుకే ఈ ప్రత్యేక ఆలయం గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రాజస్థాన్ లోని బన్స్వారా జిల్లా పర్వత ప్రాంతంలో ఉన్న మదరేశ్వర్ మహాదేవ్ ఆలయం. ఇక్కడ శ్రావణ మాసం కొంచెం ప్రత్యేకం. ఇక్కడ శ్రావణ హరియాలి అమావాస్య తర్వాత పదిహేను రోజుల తర్వాత ప్రారంభమవుతుంది. దీని కారణంగా ఈ పండుగ దాదాపు ఒకటిన్నర నెలల పాటు కొనసాగుతుంది. మదరేశ్వర్ మహాదేవ్ ఆలయం కేవలం శివాలయం మాత్రమే కాదు, ఈ ఆలయం భారతీయ సంస్కృతికి చెందిన గంగాజమునీ తెహజీబ్‌కు సజీవ రుజువు. ఈ ఆలయంలో శివలింగంతో పాటు ఫకీర్ బాబా సమాధి కూడా ఉంది. ఇది మరెక్కడా కనిపించని అరుదైన దృశ్యం. అందుకే ఇక్కడ శివుని భక్తులు, భోలేనాథ్ ప్రభువును పూజించడంతో పాటు, సమాధి వద్ద పూర్తి భక్తితో ప్రార్థనలు చేస్తారు. శివ భక్తులు శివుడికి జలాభిషేకం చేసి, సమాధిపై ఒక దుప్పటిని కూడా అదే భక్తితో సమర్పిస్తారు. ఇది శతాబ్దాలుగా కొనసాగుతున్న ఒక ప్రత్యేకమైన సంప్రదాయం. ముస్లిం సమాజానికి చెందిన ప్రజలు కూడా ఈ సమాధి వద్దకు వచ్చి ఆశీర్వాదం తీసుకొని, శివుడికి వినమ్రంగా నమస్కరిస్తారు. ఈ సంప్రదాయం ఈనాటిది కాదు, శతాబ్దాల నాటిది, ఇది తరతరాలుగా కొనసాగుతున్న మత సామరస్యాన్ని తెలియజేస్తుంది. ప్రస్తుత కాలంలో ప్రజలందరిలోనూ ఆధ్యాత్మిక ధోరణి పెరిగింది. ఈ క్రమంలోనే ఈ ఆలయానికి ఉన్న ప్రత్యేకత నలుమూలలా వ్యాపించి ఎంతో మందిని ఆకర్షిస్తుంది. అంతేకాకుండా ఈ ఆలయాన్ని చూడాలని ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు.


# సమోసాలు, జిలేబీలు తింటున్నారా? ప్రభుత్వ హెచ్చరిక

సాయంత్రం, వర్షం పడుతున్నప్పుడో.. వేడి వేడి సమోసాలు, హాట్ జిలేబీలు లొట్టలేసుకుంటూ తింటారు. ఆనియన్ సమోసా, ఆలూ సమోసా, కార్న్ సమోసా, పన్నీర్ సమోసా.. లోపలేమున్నా సరే సమోసా అనగానే తినేస్తుంటారు. జిలేబీలు సైతం అంతే క్రేజీగా ఎగబడి తింటుంటారు. అయితే సమోసాలు, జిలేబీలు లాంటి డీప్ ఫ్రైడ్ ఫుడ్ తినడం ఆరోగ్యానికి చాలా చాలా హానికరం అట. అయితే ఇది జస్ట్ వార్నింగ్ మాత్రమే కాదు.. సిగరెట్లు గురించి ప్రచారం చేసినట్టే సమోసా, జిలేబీలపైనా హెల్త్ వార్నింగ్ రాసిపెట్టాల్సిందే. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. సిగరెట్ తాగడం ప్రాణాలకు హానికరం. భయపెట్టే బొమ్మలతో, పెద్ద పెద్ద అక్షరాలతో ప్యాకెట్లపైరాసుంటుంది. సినిమాకు ముందు, మధ్యలో బీభత్సమైన యాడ్స్ తో అలర్ట్ చేస్తుంటారు. వాటిని చూస్తూనే, చదువుతూనే సిగరెట్లు కాల్చేస్తుంటారు. ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా, ఎంతగా ప్రచారం చేసినా.. డోంట్ కేర్ అంటుంటారు. అయితే, ఇదే కోవలో మరిన్ని హానికర పదార్థాలకూ ఇలాంటి ప్రచారమే చేయనుంది కేంద్ర ఆరోగ్య శాఖ. అందుకు నాగ్‌పూర్ ఎయిమ్స్‌ను మోడల్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. AIIMS లోని క్యాంటీన్లలో సమోసా, జిలేబీ, పకోడీ, వడా పావ్, బిస్కెట్స్ లాంటి స్నాక్స్‌పై.. హెచ్చరిక ప్రకటనలు ఏర్పాటు చేశారు. అంటే విషయం ఎంత సీరియస్‌గా నడుస్తోందో చూసుకోండి మరి. సమోసాలు మైదా పిండితో చేస్తారు. సలసల



కాగే నూనెలో మాడుస్తారు. జిలేబీల్లోనూ మైదానే ఉంటుంది. పాకంలో చక్కెర భారీగా కుమ్మరిస్తారు. బోండాలు, పకోడీలూ లాంటివి కూడా అంతే. వీటిలో ఎలాంటి న్యూట్రిషన్ వాల్యూస్ ఉండవు. వట్టి కేలరీలు మాత్రమే ఉంటాయి. అధిక కార్బోహైడ్రేట్స్, అధిక కొవ్వు, హానికర ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక చక్కెర.. మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అందుకే అవి తింటే చాలా చాలా అనారోగ్యం అంటున్నారు. సిగరెట్ తరహాలో ఆరోగ్య హెచ్చరికలను ఇలాంటి స్నాక్స్‌పైనా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వం డిసైడ్ అయింది. నాగ్‌పూర్ ఎయిమ్స్‌లో పైలట్ ప్రాజెక్ట్ కూడా అమలు చేస్తోంది. ముందుముందు దేశమంతా ఇదే విధానం తీసుకొస్తామని చెబుతోంది. జీవనశైలి వ్యాధులు రాకుండా, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకునేలా ప్రజల్లో అవేర్‌నెస్ క్రియేట్ చేస్తామని చెబుతోంది. భారతదేశం తీవ్ర ఆరోగ్య సంక్షోభాన్ని ఫేస్ చేస్తోంది. ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు లాంటి సమస్యలకు పోషక విలువలు లేని డీప్‌ఫ్రైడ్, చక్కెర స్నాక్స్ తరచుగా తీసుకోవడమే కారణమని గుర్తించింది. 2050 నాటికి 440 మిలియన్ల మంది భారతీయులు అధిక బరువు, ఊబకాయంతో బాధపడే అవకాశం ఉందని రీసెర్చ్ పేపర్ చెబుతోంది. అందుకే కేంద్రం అలర్ట్ అయింది. అయితే, ఇలాంటి ఫుడ్ ఐటమ్స్ పై సర్కారు నిషేధం విధించలేదు. అందుకే అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తోంది. తింటే ఎలాంటి నష్టమో ప్రభుత్వం హెచ్చరిస్తుంది అంతే. అవి తానాలా వద్దా? అనేది వినియోగదారుల ఇష్టమే. ఇప్పటికే సంప్రదాయక ఆహారమైన మిల్లెట్స్‌ను ప్రోత్సహిస్తోంది కేంద్రం. నూనె వినియోగం తగ్గించాలని ప్రధాని మోదీ సైతం పిలుపుఇచ్చారు. ఇప్పుడిలా జంక్ ఫుడ్‌పై హెచ్చరిక జారీ చేస్తూ మరింత విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మరి మారతారా లేదా అనేది మీ ఇష్టం.

# బ్రిటన్ రాజు చార్లెస్3ని కలిసిన భారత క్రికెటర్లు



ప్రస్తుతం భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా భారత పురుషుల క్రికెట్ టీమ్ మెంబర్స్ లండన్ లోని క్లారెన్స్ హౌస్ గార్డెన్ వద్ద బ్రిటన్ రాజు చార్లెస్3ను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ఇది భారత టీమ్ కు ఎంతో గర్వకారణమైన మూమెంట్ అని అన్నారు. ఈ ప్రత్యేక సమావేశానికి టీమ్ లోని కొంతమంది పాపులర్ క్రికెటర్లు అయిన.. జస్ప్రీత్ బుమ్రా, శుభ్‌మన్ గిల్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ లు హాజరయ్యారు. ఈ సందర్శనలో బ్రిటన్ రాజు టీమిండియా ప్లేయర్స్ తో ఎంతో ఆప్యాయతతో ముచ్చటించారు. క్రికెట్ పై ఆయన ఆసక్తిని కూడా ప్లేయర్స్ తో షేర్ చేసుకున్నారు. కింగ్ చార్లెస్ మాట్లాడుతూ, లార్డ్స్ వేదికగా ఇటీవల జరిగిన మూడో టెస్టు మ్యాచ్ హైలైట్స్‌ను తాను చూశానని తెలిపారు. ప్రత్యేకంగా భారత్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఔటైన తీరు గురించి ప్రస్తావిస్తూ, అది ఎంతో దురదృష్టకరమని, బంతి స్టంప్స్‌ను తాకే విధంగా వెళ్లిందని అన్నారు. ఈ సందర్భాన్ని గుర్తు చేస్తూ, భారత యంగ్ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, కింగ్ చార్లెస్‌ను కలవడం చాలా అద్భుతంగా ఉంది. ఆయన మాతో ఎంతో సహజంగా, ఆత్మీయంగా మాట్లాడారు. క్రికెట్ విషయాల్లో ఆయన చూపిన ఆసక్తి చూస్తే ఆశ్చర్యం వేస్తుంది అని తెలిపారు. ఇక ఈ సమావేశం భారత క్రికెట్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యతను మరింత పెంచింది. రాజవంశంతో క్రికెట్ జట్టుకు ఈ విధమైన సంబంధం ఏర్పడటం అరుదైన విషయం. ఇది ఆటగాళ్లకు మరిచిపోలేని అనుభూతిగా మిగిలిపోయింది. కాగా ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మీటింగ్ కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి.


# తెలుగమ్మాయికి కెరీర్ బెస్ట్ ర్యాంక్







ఒత్తిడి అనేదే లేకుండా మరింత ఎనర్జీతో ఆడుతున్న భారత ఓపెనర్ షఫాలీ వర్మ ర్యాంకింగ్స్ లో టాప్ స్థానంలోకి చేరుకుంది. ఇంతకుముందు ఉన్న ఫామ్ తో బౌలర్లను వణికించిన ఈ లేడీ సెహ్వాగ్ ఐసీసీ మహిళల ర్యాంకింగ్స్ లో మళ్లీ టాప్10లో నిలిచింది. ఇంగ్లండ్‌తో జరిగిన పొట్టి సిరీస్‌లో పరుగులతో షఫాలీ టీ20 బ్యాటర్లలో తన స్టామినాతో తొమ్మిదో స్థానం దక్కించుకుంది. ఫస్ట్ సిరీస్ లోనే అద్భుతంగా రాణించిన తెలుగమ్మాయి శ్రీ చరణి ఏకంగా టాప్ టెన్ లో నిలవడం హైలెట్ గా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న ఈ స్పిన్ కెరటం ఆరో ర్యాంక్ కైవసం చేసుకుంది. భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన థర్డ్ ప్లేస్‌లో కొనసాగుతుండగా.. రెండు స్థానాల్ని కోల్పోయిన మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 14వ ర్యాంక్ సాధించింది. ఇంగ్లండ్ చరిత్రాత్మక పొట్టి సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన రాధా యాదవ్ బౌలర్ల ర్యాంకింగ్స్ లో 5 వ స్థానంలో నిలిచింది. పేసర్ అరుంధతీ రెడ్డి నాలుగు స్థానాలు మెరుగుపరచుకొని 36వ ర్యాంక్ సొంతం చేసుకుంది. ఆల్ రౌండర్ దీప్తి శర్మకు మాత్రం షాక్ తగిలింది. ఇక టాప్ 2 లో ఉన్న ఆమె మూడో స్థానానికి పడిపోయింది. మహిళా బ్యాటర్ల టాప్ 5 ర్యాంకింగ్స్ ను గనుక చూసినట్లయితే.. బేత్ మూనీ ఆస్ట్రేలియా, హేలీ మాథ్యూస్ వెస్టిండీస్, స్మృతి మంధానా భారత్, తహ్లియా మెక్ గ్రాత్ ఆస్ట్రేలియా, లారా వొల్వార్ట్ దక్షిణాఫ్రికా. మహిళా బౌలర్ల టాప్ 5 ర్యాంకింగ్స్ ను చూస్తే.. సదియా ఇక్బాల్ పాకిస్థాన్, అనబెల్ సథర్‌లాండ్ ఆస్ట్రేలియా, దీప్తి శర్మ భారత్, సోఫీ ఎకిల్‌స్టోన్ ఇంగ్లండ్, లారెన్ బెల్ ఇంగ్లండ్. మహిళా ఆల్‌రౌండర్ల టాప్ 5 ర్యాంకింగ్స్ ను చూస్తే.. హేలీ మాథ్యూస్ వెస్టిండీస్, అమేలి కేర్ న్యూజిలాండ్, దీప్తి శర్మ భారత్, అష్ గార్డ్‌నర్ ఆస్ట్రేలియా, చమరి ఆటపట్టు శ్రీలంక. పొట్టి క్రికెట్ సంచలనం షఫాలీ మరోసారి తన మెరుపులతో ఫ్యాన్స్ ను అలరిస్తోంది. ఫామ్‌లేమితో ఏడాది పాటు జట్టుకు దూరమైన ఈ డాషింగ్ ఓపెనర్ ఇంగ్లండ్ పర్యటనలో మెరుపు బ్యాటింగ్ తో బెంబేలెత్తిస్తోంది. ఈమధ్యే ముగిసిన ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌లో 158.56 స్ట్రయిక్ రేటుతో 176 రన్స్ కొట్టింది.

# టీమిండియా వామప్ మ్యాచ్‌లు





మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 ఏర్పాటులో భాగంగా టీమిండియా రెండు వామప్ మ్యాచ్ లు ఆడనుంది. పుష్కర కాలం తర్వాత జరగనున్న ఈ మెగా టోర్నీలో పటిష్టమైన ఇంగ్లండ్, న్యూజిలాండ్ టీమ్స్ తో టీమిండియా తలపడనుంది. చిన్నస్వామి స్టేడియంలో సెప్టెంబర్ 25న ఇంగ్లండ్‌ను, 27న కివీస్ ను హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఢీకొననుంది. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ వరల్డ్ కప్ వామప్ మ్యాచ్‌ల వేదికలను, తేదీలను ప్రకటించింది. ఆనవాయితీ ప్రకారం ప్రపంచ కప్ సంసిద్ధతగా భావించే ఈ మ్యాచ్‌లను బెంగళూరు, శ్రీలంకలోని కొలంబో గ్రౌండ్స్ లో జరపాలని ఐసీసీ నిర్ణయించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ టీమ్స్ కొలంబోలో ఆడుతాయని తెలిపింది. పన్నెండేళ్ల తర్వాత మహిళల వన్డే వరల్డ్ కప్ పోటీలకు ఉపఖండం ఆతిథ్యమిస్తోంది. భారత్, శ్రీలంక కలిపి నిర్వహించే ఈ టోర్నీ సెప్టెంబర్ 30న షురూ కానుంది. నవంబర్ 12న జరిగే ఫైనల్ మ్యాచ్ తో టైటిల్ విజేత ఎవరో తేలిపోనుంది. హైబ్రిడ్ మోడల్‌లో జరుగబోయే ఈ టోర్నీని ఐదు వేదికలపై నిర్వహిస్తారు. భారత్ లోని బెంగళూరు, గువాహటి, విశాఖపట్నం, ఇండోర్ స్టేడియాల్లో, లంకలోని కొలంబోలో వరల్డ్ కప్ మ్యాచ్ లు అభిమానులను అలరించనున్నాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ మెగా ఈవెంట్ లో రెండు గ్రూపులో టాప్ 4 జట్లు సెమీస్‌కు దూసుకెళ్తాయి. అగ్రస్థానంలోని టీమ్ నాలుగో ప్లేస్ లోని టీమ్ ఢీకొననుండగా.. రెండో స్థానంలో నిలిచిన జట్టుతో మూడో ప్లేస్ లోని టీమ్ తలపడనుంది. బెంగళూరులో జరుబోయే వరల్డ్ కప్ ఆరంభ పోరులో భారత జట్టు సెప్టెంబర్ 30న శ్రీలంకతో తాడోపేడో తేల్చుకోనుంది. సెప్టెంబర్ 25న బెంగళూరులో.. భారత్ వర్సెస్ ఇంగ్లండ్ - బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 1 గ్రౌండ్, దక్షిణాఫ్రికా వర్సెస్ న్యూజిలాండ్ - చిన్నస్వామి స్టేడియం. కొలంబోలో.. శ్రీలంక వర్సెస్ పాకిస్థాన్ - కొలంబో క్రికెట్ క్లబ్ లో జరుగుతుంది. ఇక సెప్టెంబర్ 27న బెంగళూరు.. ఆస్ట్రేలియా వర్సెస్ ఇంగ్లండ్ - బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 1 గ్రౌండ్ లో జరుగుతుంది. అలాగే భారత్ వర్సెస్ న్యూజిలాండ్ - చిన్నస్వామి స్టేడియం లో నిర్వహిస్తారు. నెక్ట్స్ లో కొలంబో.. శ్రీలంక వర్సెస్ బంగ్లాదేశ్ - కొలంబో క్రికెట్ క్లబ్ లో మ్యాచ్ ను షెడ్యూల్ చేశారు. సెప్టెంబర్ 28న బెంగళూరులో దక్షిణాఫ్రికా వర్సెస్ భారత్ - బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 1 గ్రౌండ్ లో మ్యాచ్ ను ఏర్పాటు చేశారు. కొలంబోలో పాకిస్థాన్ వర్సెస్ శ్రీలంక 'ఏ' జట్టు - కొలంబో క్రికెట్ క్లబ్ లో నిర్వహిస్తారు.



# ఒలింపిక్స్‌లో క్రికెట్.. కీలక షెడ్యూల్

లాస్ ఏంజిల్స్ 2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు కూడా చోటు దక్కిన సంగతి తెలిసిందే. ఈ గేమ్స్ లో భాగంగా 2028 జులై 12 నుంచి క్రికెట్ మ్యాచులు స్టార్ట్ కానున్నాయి. గ్రూప్ స్టేజ్ లో ప్రతి టీమ్ రెండు టీ20 మ్యాచులు ఆడనుంది. జులై 20, 29 తేదీల్లో మెడల్ మ్యాచులను ఏర్పాటు చేశారు. జులై 14, 21 తేదీల్లో మాత్రం ప్లేయర్స్ కు విశ్రాంతిని ఇచ్చేందుకు ఎలాంటి మ్యాచ్‌లు నిర్వహించరు. రోజుకు రెండు గ్రూప్ దశ మ్యాచులు జరిగేలా షెడ్యూల్ ను రిలీజ్ చేశారు. ఉదయం 9.00 గంటలకు మొదటి మ్యాచ్, సాయంత్రం 6.30 గంటలకు రెండో మ్యాచ్ ఏర్పాటు చేస్తారు. కాలిఫోర్నియాలోని పోమోనా సిటీలోని ఫెయిర్ గ్రౌండ్స్ స్టేడియంలో ఈ మ్యాచులు జరగనున్నాయి. పురుషులు, మహిళల విభాగాల్లో ఆరు టీమ్స్ చొప్పున పోటీ పడనున్నారు. ఒక్కో టీమ్ కోసం 15 మంది సభ్యుల స్క్వాడ్‌ను సెలెక్ట్ చేస్తారు. క్రికెట్ కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకున్న నిర్వాహకులు క్రికెట్ ను ఒలింపిక్స్‌లో చేర్చారు. అమెరికాలో కూడా క్రికెట్ కు క్రమంగా ఆదరణ పెరుగుతోంది. గతేడాది జరిగిన టీ20 వరల్డ్ కప్ టోర్నీకి యూఎస్ఏ, వెస్టిండీస్ కలిపి ఆతిథ్యమిచ్చాయి. అప్పట్లో మూడు వేదికల్లో మ్యాచులను నిర్వహించారు. ఇక 2028లో జరగనున్న ఒలింపిక్స్ లో క్రికెట్ తో పాటు ఫ్లాగ్ ఫుట్ బాల్, బేస్‌బాల్, లక్రాస్, స్క్వాష్ గేమ్స్ కి చోటు దక్కింది. ప్యారిస్ వేదికగా 1900లో జరిగిన ఒలింపిక్స్ లో చివరిసారిగా క్రికెట్ మ్యాచులు జరిగాయి. అప్పట్లో ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్ లు మాత్రమే తలపడగా యూకేను విజయం వరించింది. టెస్ట్, వన్డేల్లాంటి దీర్ఘ ఫార్మాట్ ల నిర్వహణకు తగినంత సమయం లేక ఒలింపిక్స్ లో క్రికెట్ స్థానం కోల్పోవడానికి ఒక రీజన్ అని విశ్లేషకులు చెబుతారు. స్టేడియాలు, ఇతర మౌలిక వసతుల లేమి కూడా ఈ పరిస్థితికి మరో కారణం. ఇక క్రికెట్ కేవలం సౌత్ ఏసియా దేశాలకే పరిమితమైన గేమ్ అనే ఫీలింగ్ కూడా దీనికి తగ్గట్లు మారింది. ఒలింపిక్స్ కమిటీలో క్రికెట్ ఆడే దేశాలకు మొదట్లో ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం కూడా ఓ కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఒలింపిక్స్‌లో నిత్యం సత్తా చాటే అమెరికా, చైనా ల్లాంటి దేశాల్లో క్రికెట్‌కు ఆదరణ తక్కువే. అయితే, టీ20 ఫార్మాట్ రాకతో పరిస్థితి మారింది. ఈ నేపథ్యంలో 2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు కూడా చోటు కల్పిస్తూ ఒలింపిక్స్ కమిటీ ముంబైలో జరిగిన 141వ సమావేశాల్లో నిర్ణయించింది. దీంతో ఒలింపిక్స్ లో క్రికెట్ ను యాడ్ చేయడంతో క్రికెట్ లవర్స్ కు మంచి ట్రీట్ ఇచ్చినట్లు అయ్యింది.

# క్రికెటర్ యశ్ దయాల్ ను అరెస్టు చేయకండి: హైకోర్టు




క్రికెటర్ యశ్ దయాల్ కు అలహాబాద్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. అతన్ని అరెస్టు చేయవద్దు అని అలహాబాద్ హైకోర్టు స్టే ఇచ్చింది. ఓ మహిళను లైంగికంగా వేధించినట్లు ఆ ఐపీఎల్ క్రికెటర్ పై కేసు ఫైల్ అయిన విషయం తెలిసిందే. ఐపీఎల్ లో ఆర్సీబీ తరపున యశ్ దయాల్ ఆడుతున్నాడు. కాగా నెక్ట్స్ విచారణ వరకు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దు అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ విషయాన్ని అతని తరపు న్యాయవాది గౌరవ్ త్రిపాఠి పేర్కొన్నారు. జస్టిస్ సిద్ధార్థ వర్మ, అనిల్ కుమార్ తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఎఫ్ఐఆర్ ను సవాల్ చేస్తూ క్రికెటర్ దయాల్ పిటీషన్ దాఖలు చేశాడు. 27 ఏళ్ల క్రికెటర్ పై జూలై ఆరో తేదీన పిటీషన్ నమోదు అయ్యింది. ఘజియాబాద్ జిల్లాలోని ఇందిరాపురం పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 69 అంటే.. మోసపూరితంగా, లైంగికంగా వేధించడం కింద ఈ కేసు బుక్ చేశారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ మహిళను శృంగారపరంగా వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఇద్దరూ అయిదేళ్ల క్రితం కలుసుకున్నారు. కానీ దయాల్ ప్రతిసారి పెళ్లిని వాయిదా వేస్తూ వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ క్రికెటర్ మరో అమ్మాయితో తిరుగుతున్నట్లు సదరు మహిళ ఫిర్యాదులో వెల్లడించింది. ముఖ్యమంత్రి ఆన్‌లైన్ గ్రీవియన్స్ పోర్టల్‌కు జూన్ 21వ తేదీన ఆమె ఫిర్యాదు అందింది. ఈ కేసును ఫైల్ చేసినప్పుడు దయాల్ పై దారుణంగా ట్రోల్స్ వచ్చాయి. ఆ తర్వాత ఆయన తిరిగి అవన్నీ ఆరోపణలు అని పిటీషన్ వేయగా.. దీనిపై అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టింది.





# రిలీజ్ కు ముందే పెద్ది రికార్డులు



కొన్ని సినిమాలు రిలీజయ్యాక అందులో ఉన్న కంటెంట్ తో సినిమాపై అంచనాలు పెరుగుతాయి. కాని మరికొన్ని సినిమాలు ఎలాంటి కంటెంట్ లేక హల్ చల్ అవుతాయి. మరి ఇంకొన్ని అయితే రిలీజ్ కు స్టార్ హీరో ప్రాజెక్ట్ ని బట్టి రికార్డులు క్రియేట్ చేస్తాయి. ఇప్పుడు కూడా అలా ఓ టాలీవుడ్ మూవీ రికార్డ్ క్రియేట్ చేస్తుంది. మరి ఆ మూవీ ఏంటంటే.. రామ్ చరణ్, బుచ్చిబాబు సాన కాంబోలో వస్తున్న పెద్ది. పాన్ ఇండియా సినిమాగా 1980 నేపథ్యం లో విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ తోనే మంచి అంచనాలను కలిగించింది. పెద్ది కోసం బుచ్చిబాబు విజన్ చాలా గొప్పగా ఉందని అతనితో పరిచయమున్న ప్రతీ ఒక్కరూ చెప్తున్నారు. భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. పెద్ది సినిమాను బుచ్చిబాబు విలేజ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిస్తున్న కారణంతో సినిమా మొత్తాన్ని విజయనగరంలోనే షూట్ చేయాల్సి ఉంది. అందుకోసం మేకర్స్ హైదరాబాద్ కు దగ్గర్లోనే విజయనగరంను సెట్ వేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఆ సెట్ కేవలం ఇల్లు మాత్రమే కాదు, విజయనగరం రోడ్లు, రైల్వే స్టేషన్, ఆఖరికి అలనాటి స్పోర్ట్స్ స్టేడియం ను కూడా సెట్స్ వేస్తున్నారట. ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్లా ఈ సెట్ ను దగ్గరుండి మరీ క్రియేట్ చేస్తున్నారు. ఇవన్నీ వింటుంటే పెద్ది బడ్జెట్ చాలా భారీగానే అయ్యేట్టుంది. మొదట్లో రూ.250 కోట్లతో మొదలైన ఈ సినిమా ఇప్పటికే రూ.300 కోట్లు దాటిందని టాక్. సెట్స్, పోస్ట్ ప్రొడక్షన్ పూర్తయ్యే నాటికి ఇంకా పెరిగే ఛాన్సుంది. అయితే ఇంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న పెద్దికి బిజినెస్ కూడా అదే రేంజ్ లో జరిగే అవకాశముంది. అందులో భాగంగానే ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ పెద్ది డిజిటల్ రైట్స్ ను రూ.105 కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకుందని తెలుస్తుంది. ఒక తెలుగు సినిమాకు వచ్చిన ఓటీటీ డీల్స్ లో ఇప్పటివరకు ఇదే ఎక్కువ. పెద్ది రేంజ్ ను ఈ టాపిక్స్ విపరీతంగా పెంచుతున్నాయంటే దానికి తోడు సినిమాకు పని చేస్తున్న కాస్ట్ అండ్ క్రూ కూడా పెద్దిపై అంచనాలను పెంచేస్తున్నాయి. పెద్దిలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీ రోల్స్ ప్లే చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమాతో రామ్ చరణ్ ఎలాంటి సక్సెస్ ను అందుకుంటారో చూడాలి.

# రాజాసాబ్ ఎంట్రీ కోసం స్పెషల్ ప్లాన్

ప్రభాస్ ప్రజంట్ యాక్ట్ చేస్తున్న బ్యాక్ టు బ్యాక్ మూవీస్ లో ది రాజాసాబ్ కూడా ఒకటి. ఈ సినిమాపై మొదట్లో అంచనాలు లేకపోయినా, ఇప్పుడు మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీనికి కారణం రీసెంట్ గా వచ్చిన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ లు. ప్రభాస్ ని ఈ లుక్స్ లో చూడాలని ఆడియన్స్ అండ్ ఫ్యాన్స్ ఎప్పట్నుండో వెయిట్ చేస్తున్నారు. ఆయన మాస్ అండ్ హారర్ కామెడీ టైమింగ్ కి ఫుల్ గా ఫిదా అయిపోయారు. దీంతో డైరెక్టర్ మారుతి తీస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పై ఇప్పుడు భారీ బజ్ ఏర్పడింది. ఇప్పటికే ప్రభాస్ కెరీర్‌లో వరుసగా భారీ పాన్ ఇండియా సినిమాలు ఉండగా, వీటన్నిటి కీ డిఫరెంట్ గా ది రాజాసాబ్ డిఫరెంట్ హారర్ సినిమా కావడం హైలెట్. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధి కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ విలన్ గా కనిపించనున్నారు. థమన్ సంగీతం అందిస్తుండగా, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇక లేటెస్ట్ సమాచారం ప్రకారం, ప్రస్తుతం సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో శరవేగంగా జరుగుతోంది. ప్రభాస్ పై ఓ కీలక సన్నివేశాన్ని షూట్ చేస్తున్నారు. ఈ సీన్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుందట. త్వరలోనే ప్రభాస్ ఇంట్రడక్షన్ సీన్ కోసం స్పెషల్ గా ఒక సాంగ్ ను కూడా షూట్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటకు థమన్ ఓ అదిరిపోయే ట్యూన్ ఇచ్చాడట. అయితే, ఈ ఇంట్రడక్షన్ పాటలో ఓ హీరోయిన్ కూడా కనిపించనుందని టాక్. అంతా ఊహిస్తున్నట్లుగా కరీనా కపూర్, అలియా భట్ లు మాత్రం ఈ పాటలో లేరట. మరి ఆ హీరోయిన్ ఎవరు? అనేది మాత్రం ఇంకా సస్పెన్స్‌గానే ఉంచారు. ఈ సీక్రెట్ బయటపడ్డాక సినిమాపై మరింత హైప్ ఏర్పడే అవకాశం ఉంది. దర్శకుడు మారుతి ప్రస్తుతం పూర్తిగా సినిమా మీదే ఫోకస్ పెట్టి, త్వరగా షూటింగ్ పూర్తి చేసి డిసెంబర్ 5న రిలీజ్ చేయాలని చూస్తున్నాడు. ఆల్రెడీ వాయిదాలు వచ్చిన నేపథ్యంలో ఈసారి లేట్ లేకుండా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. విజువల్స్, కామెడీ, సాంగ్స్‌తో కలిపి ఓ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా మలిచే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి, ది రాజాసాబ్ స్టార్టింగ్ లో అంచనాలు తక్కువగా ఉన్నా.. ఇప్పుడు మాత్రం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న మూవీగా మారిపోయింది. ప్రస్తుతం జరుగుతున్న షూటింగ్, కొత్త పాట వివరాలు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఒకవేళ ఈ సినిమా హిట్ అయితే.. సీక్వెల్ కూడా లైన్ లోకి వస్తుందని ముందే ఓ హింట్ అయితే ఇచ్చారు. ఇక దీంతో పాటు ప్రభాస్ వరుసగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ లో వర్క్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ కి ఫుల్ ఫీస్ట్ అని చెప్పొచ్చు.




# వార్ 2 సిసలైన విధ్వంసం : నాగవంశీ

ఇండియన్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాల్లో యష్ రాజ్ ఫిలిమ్స్ ప్రొడ్యూస్ చేస్తున్న భారీ ప్రాజెక్ట్ వార్ 2. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఇద్దరూ కలిసి స్క్రీన్‌పై సందడి చేయబోతున్న ఈ మల్టీ స్టారర్ కు మొదట్లో హైప్ బాగానే ఉన్నా టీజర్ తరువాత అంచనాలను అందుకోలేకపోవడం కొంత మైనస్ అయ్యింది. ఇప్పటికే షూటింగ్ పూర్తవగా.. ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచలేదు. ఇక ఈ సినిమా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను సితార నాగవంశీ రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఆయన గతంలో ఎన్టీఆర్ నటిస్తున్న దేవర సినిమాను కూడా తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయడం విశేషం. ఇప్పుడు వార్ 2 కోసం కూడా భారీ రేటుకు రైట్స్ దక్కించుకున్నారు. దీంతో ఆయన నుంచి ఈ సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ వస్తున్నాయి. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఇంట్రడక్షన్ సీన్ గురించి ఓ మాస్ కామెంట్ చేశారు. ఆ సీన్ బాగా వచ్చింది. స్క్రీన్ చిరిగిపోతుంది.. అంటూ ఎన్టీఆర్ ఎంట్రీ గురించి గట్టిగానే క్రేజ్ పెంచారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఇప్పటికే ఆ సీన్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాగే, ఈ సినిమా రైట్స్ ఎందుకు దక్కించుకున్నారన్న ప్రశ్నకు నాగవంశీ సమాధానం ఇస్తూ.. ఇద్దరు ఇండియన్ స్టార్‌లు ఎన్టీఆర్, హృతిక్.. ఒకే సినిమా కోసం కలిసి వస్తున్నారు. వాళ్లిద్దరూ స్క్రీన్‌పై తలపడతారనేది ఒక్కటే నాకు బేస్. సినిమా చూసి కాదు.. ఆ ఫేసాఫ్ కోసం మాత్రమే ఈ సినిమా తెచ్చుకున్నాను. అది ఎలా ఉంటుందో చూడాలని చాలా ఆసక్తిగా ఉన్నాను.. అన్నారు. ఈ సినిమాకు బ్రహ్మాస్త్ర ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. టెక్నికల్‌గా హాలీవుడ్ రేంజ్ లో రూపొందిన ఈ సినిమా.. దేశవ్యాప్తంగా భారీ ప్రమోషన్‌లతో విడుదల కానుందని మేకర్స్ చెబుతున్నారు. ముఖ్యంగా తెలుగు మార్కెట్‌లో ఈ సినిమాపై భారీ ఆసక్తి ఉంది. హిందీ డబ్ సినిమాల్లో రీసెంట్ టైమ్ లో ఇంత భారీ రేటుకు అమ్ముడైన సినిమా ఇదే కావడం విశేషం. వార్ 2 సినిమాతో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ల తలాపడే సీన్ కచ్చితంగా పాన్ ఇండియా రేంజ్ లో హైప్ తెచ్చిపెట్టేలా ఉంటుందని నాగవంశీ ఓ హింట్ అయితే ఇచ్చారు. ఇక ఆ మాస్ ఇంట్రో, ఫేస్ ఆఫ్ ఎలా ఉండబోతున్నాయో తెలియాలంటే ఆగస్టు 14వరకూ వెయిట్ చేయాల్సిందే.

# హరిహర వీరమల్లు 2 పై హీరోయిన్ లీక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా దర్శకులు క్రిష్, జ్యోతి కృష్ణలు తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు. ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా దీనికి పార్ట్ 2 కూడా ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. పార్ట్ 1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్ గా వస్తుండగా పార్ట్ 2 ని మరో టైటిల్ తో ప్లాన్ చేస్తున్నారు. అయితే నిధి అగర్వాల్ లేటెస్ట్ గా పార్ట్ 2 పై ఇచ్చిన లీక్స్ వైరల్ గా మారాయి. పార్ట్ 1 ఆల్రెడీ కంప్లీట్ అయ్యి రిలీజ్ కి వస్తుంది కానీ పార్ట్ 2 కి సంబంధించి తాము ఆల్రెడీ 20 శాతం షూటింగ్ ని చేసేసినట్టుగా ఆమె చెప్పుకొచ్చింది. అలాగే పార్ట్ 2 మిగతా షూటింగ్ కూడా త్వరలోనే స్టార్ట్ అవుతాయని అని కూడా తెలిపింది. దీనితో ఈ బ్యూటీ కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి. ఇక ఈ అవైటెడ్ సినిమా రానున్న జూలై 24న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కాబోతుంది. ఇక హరిహర వీరమల్లు రీసెంట్ గానే సెన్సార్ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. దీనితో సినిమా మొత్తం 2 గంటల 42 నిమిషాల డ్యూరేషన్ తో రాబోతుంది అనేది కన్ఫర్మ్ అయ్యింది. కానీ ఇప్పుడు టైటిల్ కార్డ్స్, క్రెడిట్స్ మినహాయిస్తే మొత్తం 2 గంటల 32 నిమిషాల కంప్లీట్ వీరమల్లు తాండవమే ఉంటుంది అని కన్ఫర్మ్ అయ్యింది. మరి థియేటర్స్ లో ఫ్యాన్స్ కి ఇపుడు బిగ్ ట్రీట్ ఈ జూలై 24న ఉండబోతుంది అని చెప్పవచ్చు.



# లోకేష్ కనగరాజ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



ప్రస్తుతం కోలీవుడ్ తో సహా తెలుగు ఆడియెన్స్ మంచి ఎగ్జైటింగ్ గా ఎదురు చూస్తున్న అవైటెడ్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది కూలీ అనే చెప్పాలి. ఇందుకు మూడు కారణాలు ఉన్నాయి. లోకేష్ కనగరాజ్ డైరెక్షన్, రజనీకాంత్ మాస్ యాక్షన్, కింగ్ నాగార్జున గెస్ట్ రోల్. ఇలా ఈ మూడు కలిసి ఒకే స్క్రీన్ పై చూడాలని ఆడియన్స్ తెగ ఎగ్జైట్ అవుతున్నారు. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరక్కేకించిన ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాలో కింగ్ నాగార్జున కూడా మంచి ఇంటెన్స్ పాత్ర చేస్తున్నారు. అయితే ఈ సినిమాలో నాగ్ ని గత 40 ఏళ్లలో చూపించని కొత్త వెర్షన్ లో చూస్తారని ఆ మధ్య కుబేర ప్రమోషన్స్ లో నాగ్ తెలిపారు. అలాగే ఇప్పుడు లోకేష్ కనగరాజ్ కామెంట్స్ వైరల్ గా మారాయి. నాగ్ సర్ ని ఒప్పించడం అంత తేలిక కాదని చెబుతున్నాడు. తన పాత్రపై ఐడియా ఆయనకి ఎంతో నచ్చింది అన్నారు కానీ దానిని తీర్చిదిద్దడం మాత్రం సవాలుగా మారిందని లోకేష్ అంటున్నాడు. దాదాపు ఈ క్యారెక్టర్ గురించి ఏడెనిమిది సార్లు నాగ్ కి నరేషన్ ని ఇచ్చినట్టు తాను తెలిపాడు. దీనితో తనని మాత్రం ఒప్పించడం ఒకింత కష్టమే లోకేష్ తెలిపాడు. దీనితో నాగ్ ఛాయిస్ అండ్ క్లారిటీ విషయంలో ఎలా ఉంటారు అనేది వైరల్ గా మారింది.